నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 23-6-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 271 | పేజీలు: 4 | వెల: రూ.1/-

ఏడాది తిరిగేసరికి బంగారు వాసాలమర్రి కావాలి : సీఎం కేసీఆర్

యాదాద్రి భువనగిరి, జూన్ 22: ఏడాది తిరిగే సరికి ప్రస్తుతమున్న వాసాలమర్రి.. బంగారు వాసాలమర్రి కావాలని సీఎం కేసీఆర్ అన్నారు. వాసాలమర్రి గ్రామ సందర్శనలో భాగంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు.

ఈ ఊరికి కనీసం తాను ఇంకో 20 సార్లు వస్తాను. వచ్చేసారి ఇలా సభ పెట్టను. మీ ఊరిలో నలుగురు మాత్రమే పరిచయం అయ్యారు. అందరూ పరిచయం అయ్యేలా సభ పెట్టాలి. అందరం పట్టుబడితే వాసాలమర్రి ఏడాది నాటికి బంగారు వాసాలమర్రి కావాలి. ఊరిలో పోలీసు కేసులు ఉండొద్దు. వెంటనే పరిష్కారం చేసుకోవాలి. ఒకర్ని చూస్తే మరొకరు చిరునవ్వు నవ్వాలి. ఒకరికొకరు సహకరించుకునే ప్రేమ ఏర్పడాలి. గ్రామంలో ఐకమత్యం, పట్టుదల అవసరం. కష్టం, బాధ ఎవరిదైనా ఒకటే అనే భావన ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం సపోర్ట్‌గా ఉంటుంది.. అన్ని పనులు జరగాలి. ఇవన్నీ సాధ్యమైతే వందకు వంద శాతం వాసాలమర్రి బంగారంలా తయారవుతుంది.

గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ నాయకత్వంలో అద్భుతమైన పని జరగాలి. ఆకుల ఆగమ్మ, చిన్నారి లక్ష్మితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆగమ్మ అల్ల నేరేడు పండ్లు ఇచ్చారు. అల్ల నేరేడు చెట్టు లేకుండా ఊరు ఉంటదా? ఇక అన్ని చెట్లు నాటాలి. ప్రత్యేకమైన పని జరగాలి అని సీఎం కేసీఆర్ అన్నారు.

కరోనా వస్తే డోలో మందు బిళ్ళ చాలు: సీఎం కేసీఆర్..

హైదరాబాద్ , జూన్ 22:తెలంగాణ సీఎం కేసీఆర్ మరోసారి కరోనా వైద్యంపై చేసిన వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. కరోనా వస్తే పారాసిటమాల్ వేసుకుంటే సరిపోతుందని తేల్చి చెప్పారు సీఎం కేసీఆర్. కరోనాకు మందు లేదని..కరోనా వచ్చిన సమయంలో తాను కూడ డోలో తో పాటు మరో మందు.. బిళ్ల వేసుకొన్నానని సీఎం వివరించారు.

వరంగల్ లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం కేసీఆర్ ఈ విధంగా కామెంట్స్ చేశారు. కరోనా వస్తే టెంపరేచర్ పెరుగుతోందన్నారు. జ్వరం వచ్చిన సమయంలో డాక్టర్ సలహా మేరకు డోలో టాబ్లెట్ తో పాట యాంటీ బయాటిక్ మందులను ఉపయోగించుకొంటే కరోనా తగ్గిపోతోందన్నారు. తాను కూడ ఈ రెండు రకాలైన మందులను మాత్రమే వాడానని ఆయన చెప్పారు. తనకు డీ విటమిన్ టాబ్లెట్ ఇస్తే ఉపయోగించలేదన్నారు. వారం రోజుల్లోనే తాను కరోనా నుండి కోలుకొన్నానని సీఎం చెప్పారు.

ఇప్పుడు సీఎం కామెంట్స్ పై సోషల్ మీడియాలో ట్రోల్స్ నడుస్తున్నాయి. కరోనా వస్తే పారాసిటమాల్ వేసుకుంటే సరిపోతుందని అప్పట్లో అసెంబ్లీ సాక్షిగా సీఎం చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో ట్రోల్స్ వచ్చాయి. అయితే అవే కామెంట్స్ ని ఇప్పుడు కేసీఆర్ చేయడంతో మరోసారి ట్రోల్స్ చేస్తున్నారు నెటిజన్లు.

సంస్కరణల పైన, విధాన రూపకల్పనపైన ఒక బ్లాగ్ పోస్టును గురించి వెల్లడించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 22:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన బ్లాగు లోని ఒక పోస్టు ను గురించి ఈ రోజు న వెల్లడించారు. అందులో సంస్కరణలు, కేంద్రం-రాష్ట్రాల భాగస్వామ్యం, కోవిడ్ వేళ లో సరికొత్త విధానాల కు రూపకల్పన వంటి అంశాలు ఉన్నాయి. ఈ పోస్టు ను లింక్ డ్ ఇన్ (ఒతినినవటఎని) ప్లాట్ ఫార్మ్ లోని ఖాతా లో ఎక్కించడం జరిగింది. "ఏఒతినినవటఎని ప్లాట్ ఫార్మ్ లోని నా ఖాతా లో, కేంద్రం-రాష్ట్రాల భాగస్వామ్యం స్ఫూర్తి ద్వారా, కోవిడ్-19 వేళ లో సరికొత్తది అయినటువంటి విధాన రూపకల్పన కు సంబంధించి 'పూర్తి నమ్మకం ద్వారాను, ప్రోత్సాహకాల ద్వారాను సంస్కరణల ను తీసుకు రావడం' అనే శీర్షిక తో ఒక పోస్టు ఉంది" అని పేర్కొన్నారు.

కులవృత్తుల వారికి బీమా సౌకర్యంపై మంత్రుల సమీక్ష

హైదరాబాద్ , జూన్ 22:రాష్ట్రంలోని వివిధ కులవృత్తుల వారికి బీమా సౌకర్యం కల్పించడంపై మంత్రులు సమీక్షా సమావేశం నిర్వహించారు.

నగరంలోని బీఆర్‌కేఆర్ భవన్‌లో మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ సమీక్ష చేపట్టారు. చేనేత, గీత కార్మికులు, మత్స్యకారులకు బీమా సౌకర్యంపై భేటీలో చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, సీఎస్ సోమేశ్ కుమార్, పలుశాఖల అధికారులు, బ్యాంకర్లు, ఎల్ఐసీ ప్రతినిధులు పాల్గొన్నారు. రైతు బీమా మాదిరే కులవృత్తుల వారికి కూడా తక్షణమే బీమా పరిహారం అందేలా చూస్తామని ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో తీర్మానించిన సంగతి తెలిసిందే.

హరితహారాన్ని విజయవంతం చేయాలి

రంగారెడ్డి, జూన్ 22:: ఏడో విడుత హరితహారం కార్యక్రమం విజయవంతం చేయడానికి ఇప్పటి నుంచి సమాయత్తం కావాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధికారులకు సూచించారు. అటవిశాఖ రేంజ్ అధికారి జే విష్ణువర్ధన్‌తో కలిసి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాలు, మున్సిపాలిటీల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా లక్ష్యాలు నిర్దేశించుకోవాలని చెప్పారు. మొక్కలు నాటి, సంరక్షించేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం సమకూరుస్తున్నందున ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. హరితహారంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఇబ్బందులు తెలెత్తుతాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గత నాలుగు దఫాల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రత్యేక చొరవతో మొక్కల పెంపకం ఒక యజ్ఞంలా సాగుతున్నదని ప్రశంసించారు. రైతులు తమకున్న పొలంలో కనీసం పదిశాతం చెట్ల పెంపకానికి కేటాయించేలా వారిని చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జియోమార్ట్‌తో సై.. సెప్టెంబర్‌లో టాటా సూపర్ యాప్ సేవలు షురూ!

న్యూఢిల్లీ, జూన్ 22: ఈ-కామర్స్ సేవలను ప్రారంభించేందుకు టాటా సన్స్ అనుబంధ టాటా డిజిటల్ సిద్ధం అవుతున్నది. సెప్టెంబర్‌లో బెంగళూరు కేంద్రంగా టాటా డిజిటల్ తన సూపర్ యాప్ సేవలను ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నది. ఈ-కామర్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫ్యాషన్, లైఫ్ స్టైల్ తదితర విస్తృత శ్రేణి ఉత్పత్తులను డెలివరీ చేయనున్నది.

ఈ-కామర్స్ బిజినెస్ ప్రారంభించడానికి అవసరమైన నిధుల సేకరణపై టాటా సన్స్ కేంద్రీకరించింది. ఓవర్సీస్ ఇన్వెస్టర్ల నుంచి సుమారు 2-2.5 బిలియన్ల డాలర్ల పెట్టుబడులను ఆకర్షించే విషయమై చర్చిస్తున్నది. ఇందుకోసం గత నెలలో టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ అమెరికాలో పర్యటించారు.

ఈ-కామర్స్ బిజినెస్‌లో ఇప్పటికే రంగ ప్రవేశం చేసిన రిలయన్స్ జియోమార్ట్, అమెజాన్ ఇండియా, వాల్‌మార్ట్ సారధ్యంలోని ఫ్లిప్‌కార్ట్ తదితర సంస్థలతో పోటీ పడేందుకు టాటా డిజిటల్ సిద్ధమైంది. కరోనా నేపథ్యంలో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల్లో డిజిటల్ లావాదేవీలకు ప్రాధాన్యం పెరిగింది.

టాటా డిజిటల్ సేవలను ముందుకు తీసుకెళ్లేందుకు వ్యూహాత్మక పెట్టుబడి దారుల నుంచి ఇన్వెస్ట్‌మెంట్లను ఆకర్షించేందుకు గల అవ్షన్లను టాటా సన్స్ పరిశీలిస్తున్నది. ఇప్పటికే హెల్త్ అండ్ ఫిట్‌నెస్ స్టార్టప్ క్యూర్ ఫిట్ సహా వ్యవస్థాపకుడు ముకేశ్ బన్సాల్.. టాటా డిజిటల్‌లో అధ్యక్షుడిగా చేరారు.

ప్రతి గ్రామ పంచాయతీకి రూ. 25 లకలు : సీఎం కేసీఆర్

యాదాద్రి భువనగిరి, జూన్ 22:: యాదాద్రి భువనగిరి జిల్లాలోని 421 గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటన్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. వాసాలమర్రి పుణ్యమా అని జిల్లాలోని గ్రామాలు అభివృద్ధి అవుతున్నాయి. ముఖ్యమంత్రి నిధి నుంచి ప్రతి గ్రామ పంచాయతీకి రూ. 25 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నాను. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలకు కూడా నిధులు మంజూరు చేస్తాను. భువనగిరి మున్సిపాలిటికీ రూ. కోటి, మిగతా ఐదు మున్సిపాలిటీలకు రూ. 50 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు.

త్వరలో గ్రామ అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేయాలి. అధికారులు వచ్చి ప్రతి ఇంటి పరిస్థితిని అధ్యయనం చేయాలి. వాసాలమర్రికి కూడా పండ్ల గ్రామాల ప్రజలు వచ్చి అభివృద్ధి నేర్చుకోని పోవాలన్నారు. ఈ గంట నుంచి కులం లేదు, మతం లేదు, జాతి లేదు. మనందరిది ఒకటే కులం. మనది అభివృద్ధి కులం, బాగుపడే కులం అని సీఎం పేర్కొన్నారు. ఇలా ముందుకుపోతే తప్పకుండా విజయం సాధిస్తామని కేసీఆర్ స్పష్టం చేశారు.

దేశానికే ఆదర్శం రైతు వేదికలు : ఎమ్మెల్యే కొప్పుల

హైదరాబాద్ , జూన్ 22:రైతువేదికల నిర్మాణం దేశానికే ఆదర్శమని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన అన్ని కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. మంగళవారం పరిగి మండలంలోని రంగాపూర్, రాపోల్, సయ్యద్‌పల్లి, చిగురాల్‌పల్లి గ్రామాలలో నిర్మాణం చేపట్టిన రైతువేదికలను ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పంటలు సాగు చేసేందుకు అవసరమైన పెట్టుబడి సహాయం దగ్గర నుంచి పండించిన వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు వరకు ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

రైతుబంధు, రైతుబీమా పథకాలు ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందాయని అన్నారు. ప్రస్తుత కరోనా సంక్షోభంలో ప్రభుత్వానికి ఆదాయం మూర్తిగా తగ్గిపోయినా రైతులకు పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి సాయం ఎకరాకు రూ.5వేలు అందజేశారని చెప్పారు.

రైతులు అప్పులు చేయకుండా పంటల సాగు చేపట్టాలన్నది సర్కారు ప్రధాన ఉద్దేశమని అన్నారు. ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రతి రైతు వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేపట్టడం జరిగిందన్నారు.

రైతువేదికల నిర్మాణం ద్వారా రైతులు ఒక దగ్గర కూర్చొని పంటల సాగు, మార్కెటింగ్ తదితర అంశాలు చర్చించుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశంలో ఎక్కడా లేవని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.అరవిందరావు, జెడ్పీటీసీ బి.హరిప్రియ, పీఏసీఎస్ చైర్మన్ కొప్పుల శ్యాంసుందర్‌రెడ్డి, పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మండల రైతుబంధు సమితి కో-ఆర్డినేటర్ మేడిద రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధానికి షాక్.. పరువు నష్టం కేసులో భారీ జరిమానా

న్యూఢిల్లీ, జూన్ 22:మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడకు బెంగళూరు సివిల్ కోర్టు భారీ జరిమానా విధించింది. పదేళ్ల నాటి వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో ఈ తీర్పును వెల్లడించింది. రూ.2కోట్లు చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. 2011 జూన్ 28న గౌడర గర్జన పేరుతో నిర్వహించిన ఓ టీవీ షో ఆయన పాల్గొన్నారు. ఈ ఛానల్‌కు ఆయన ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూలో నంది ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ ఎంటర్‌ప్రైజ్(NICE) ప్రాజెక్టుపై దేవెగౌడ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆ కంపెనీ ప్రతినిధులు కోర్టును ఆశ్రయించారు. ఆయన చేసిన వ్యాఖ్యలతో తమ పరువుకు భంగం వాటిల్లిందంటూ పిటిషన్ పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన బెంగళూరు సెషన్స్ కోర్టు ఐఎఅఇ ఆరోపణల్లో నిజం ఉందని తేల్చింది. ఐఎఅఇ ప్రాజెక్టును గతంలో కర్ణాటక హైకోర్టు, సుప్రీంకోర్టు తమ తీర్పుల్లో సమర్థించాయని న్యాయస్థానం గుర్తుచేసింది. ఇది కర్ణాటక ప్రజల ప్రయోజనాల కోసం కంపెనీ చేపట్టిన పెద్ద ప్రాజెక్టు అని సమర్థించింది, ఇలాంటి ప్రాజెక్టుపై పరువు నష్టం వ్యాఖ్యలను అనుమతిస్తే ప్రజల కోసం చేపట్టిన ప్రాజెక్టు ఆలస్యమవుతుందని అభిప్రాయపడింది. కంపెనీ పరువుకు భంగం కలిగించినందుకు NICE కి దేవెగౌడ రూ. 2 కోట్లు చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో భారీ డిస్కౌంట్లు ఇక కుదరవు!

న్యూఢిల్లీ, జూన్ 22: ఈ-కామర్స్ సైట్లపై భారత ప్రభుత్వం కఠిన నిబంధనలు తీసుకురానుంది. ఇవి అమల్లోకి వస్తే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లాంటి ఈ-కామర్స్ సైట్లు ఇక నుంచి ఫ్లాష్ సేల్స్ అంటూ వస్తువులపై భారీ డిస్కౌంట్లు ప్రకటించే అవకాశం ఉండదు. ఇప్పటికే వినియోగదారుల రక్షణ చట్టానికి చేసిన సవరణలపై జులై 6లోగా వ్యాఖ్యలు/సలహాలు ఇవ్వాలని వినియోగదారుల వ్యవహారాల శాఖ కోరింది. ఇండియాలో ఏడాది మొత్తం ఏదో ఒక సందర్భం పేరు చెప్పి భారీ డిస్కౌంట్లతో సేల్స్ ప్రకటిస్తాయి ఈ సైట్లు. దీనివల్ల చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఈ ఈ-కామర్స్ సైట్ల వల్ల నష్టపోతున్నామంటూ వినియోగదారులు, వ్యాపారులు, అసోసియేషన్ల నుంచి ఎన్నో ఫిర్యాదులు వచ్చినట్లు ప్రభుత్వం చెబుతోంది. దీంతో ఇండియాలో ఏ ఈ-కామర్స్ సైటు కూడా ఫ్లాష్ సేల్స్ నిర్వహించకూడదన్న ప్రతిపాదనను వినియోగదారుల మంత్రిత్వ శాఖ తెరపైకి తెచ్చింది. ఈ ఫ్లాష్ సేల్స్ ఇటు కస్టమర్లకు, అటు ఈ-కామర్స్ సైట్లకు బాగానే లాభాలు తెచ్చిపెడుతున్నా.. చిన్న వ్యాపారులు మాత్రం నష్టపోతున్నారు.

ఇలాంటి ఫ్లాష్ సేల్స్‌తో వినియోగదారులకు ఉండే అవకాశాలను ఈ-కామర్స్ సైట్లు పరిమితం చేస్తున్నాయని, దీనివల్ల భవిష్యత్తులో ధరలు పెరిగే అవకాశం ఉంటుందని ఆ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. అంతేకాకుండా సెర్చ్ ఫలితాలను తారుమారు చేసి కొందరే సెల్లర్లను ఈ-కామర్స్ సైట్లు ప్రమోట్ చేస్తున్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది.

థర్డ్ వేవ్ ఉంటుందా..? ఉండదా.. ? అనేది మనచేతుల్లోనే ఉంది: డాక్టర్ వి.కె. పాల్

న్యూఢిల్లీ, జూన్ 22: కరోనా నియంత్రణకు అవసరమైన జాగ్రత్తలన్నీ పాటిస్తూ, ఎక్కువ శాతం జనాభాకు వ్యాక్సినేషన్ అందించగలిగితే కోవిడ్ వైరస్ థర్డ్ వేవ్ను అడ్డుకోవచ్చని నీతీ ఆయోగ్ ఆరోగ్య వ్యవహారాల సభ్యుడు డాక్టర్ వి.కె. పాల్ అభిప్రాయపడ్డారు. కోవిడ్ నియంత్రణకు తగిన జాగ్రత్తలు పాటించి, మనమంతా వ్యాక్సినేషన్ తీసుకుంటే అసలు థర్డ్ వేవ్ ఎందుకు వస్తుంది? అసలు సెకండ్ వేవ్ కూడా రాని దేశాలు ప్రపంచంలో ఉన్నాయి. కరోనా వైరస్ కట్టడికి అవసరమైన జాగ్రత్తలన్నీ పాటిస్తే మామూలు పరిస్థితితులు నెలకొంటాయని ఆయన పేర్కొన్నారు.

భారత దేశంలో ఆర్థిక వ్యవస్థ తిరిగి పట్టాలెక్కేలా చేయాలంటే, మామూలు కార్యకలాపాలన్నీ తిరిగి కొనసాగాలంటే వేగవంతంగా వ్యాక్సినేషన్ నిర్వహించడం చాలా ముఖ్యమని వి.కె. పాల్ స్పష్టం చేశారు. "మన దైనందిన కార్యకలాపాలను, సామాజిక జీవితాన్ని తిరిగి కొనసాగించాల్సిన అవసరం ఉంది. పాఠశాలలు, వాణిజ్య కార్యకలాపాలను తిరిగి ప్రారంభించి ఆర్థిక వ్యవస్థను జాగ్రత్తగా కాపాడుకోవడమూ అవసరమే, వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వేగంగా చేపట్టగలిగినప్పుడే మనం ఇవన్నీ చేయగలుగుతాం'' అని ఆయన వివరించారు.

రైతుబంధు రుణం కింద జమచేసుకోవద్దు.. బ్యాంకర్లకు మంత్రి హరీశ్ ఆదేశం

హైదరాబాద్ , జూన్ 22: బకాయిల వసూలు, సర్దుబాటుకు రైతుబంధు నగదు జమచేయవద్దని అన్ని శాఖల బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రైతుబంధు నిధులను కొన్ని బ్యాంకులు రుణబకాయిలకు జమ చేసుకోవడంపై బ్యాంకర్లతో మంత్రి హరీశ్‌రావు, సీఎస్ సోమేశ్ కుమార్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎం ఆదేశాల మేరకు బ్యాంకర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకర్లు స్పందిస్తూ తాము ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదన్నారు. దీనిపై మంత్రి హరీశ్ స్పందిస్తూ.. రైతుబంధు నగదును ఎట్టి పరిస్థితుల్లో ఆపరాదన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతుల కోసం టోల్ ఫ్రీ నంబర్లు.. 180020 01001, 040 33671300 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇవి పనిచేయనున్నట్లు తెలిపారు. పంట రుణాలు, రెన్యువల్ మంజూరును వేగవంతం చేయాలని బ్యాంకర్లను మంత్రి ఆదేశించారు.

చరిత్రలో నేటినిజం





వాసాలమర్రి గ్రామస్తులతో సీఎం కేసీఆర్ సహపంక్తి భోజనం

యాదాద్రి భువనగిరి, జూన్ 22:: జిల్లాలోని వాసాలమర్రిలో సీఎం కేసీఆర్ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా వాసాలమర్రి గ్రామస్తులతో కలిసి సీఎం కేసీఆర్ సహపంక్తి భోజనం చేశారు. ఇక భోజనం చేస్తున్న మహిళల వద్దకు వెళ్లి సీఎం కేసీఆర్ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భోజనాలు ఎలా ఉన్నాయని అడిగారు. కేసీఆర్ ఒక సామాన్యుడిలా వారి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలుకరించడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలోని 3 వేల మందికి ఒకేసారి భోజన ఏర్పాట్లు చేశారు. వాసాలమర్రిలోని కోదండ రామాలయంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక పూజలు చేశారు.

23 రకాల వంటకాలు..

వాసాలమర్రి గ్రామస్తులకు 23 వంటకాలను వడ్డించారు. మటన్, చికెన్, ఆకుకూరలు, బోటీ కర్రి, చేపలు, తలకాయ కూర, కోడిగుడ్డు, రెండు రకాల స్వీట్లు, పాలక్ పన్నీరు, బిర్యానీ, పులిహోర, సాంబార్, పండ్ల రసాలు, ఆలుగడ్డతో పాటు పలు వైరైటీలు చేశారు.

ఆంధ్రోళ్లు తెలంగాణకు అన్యాయం చేయడానికే ఉంటారు: మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మహబూబ్, జూన్ 22:మహబూబ్ నగర్ పర్యటనలో తెలంగాణ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఏపీ ప్రభుత్వం కడుతున్న అక్రమ ప్రాజెక్టులపై ఆయన మండిపడ్డారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజలు మరో యుద్ధానికి సిద్ధం కావాలని మంత్రి ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. లంకలో పుట్టినోళు అంతా రాక్షసులనని, ఆంధ్రోళ్లు ఎప్పటికీ తెలంగాణకు అన్యాయం చేయడానికే ఉంటారని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే కేసీఆర్ చూస్తూ ఊరుకోరని, తగిన చర్యలు తీసుకుంటారని వేముల ప్రశాంత్ రెడ్డి హెచ్చరించారు. తమ ప్రాంతానికి అన్యాయం చేస్తూ ప్రాజెక్టులు కడుతుంటే ఎలా చూస్తూ ఊరుకుంటామని అని ఆయన అన్నారు.

సంచలన ప్రకటన చేసిన మిజోరాం మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 22:ఫాదర్స్ డే నాడు మిజోరాం రాష్ట్రానికి చెందిన మంత్రి రాబర్ట్ రోమావియా ఓ వింత ప్రకటన చేశారు. 'నా నియోజకవర్గంలో ఎక్కువ మంది పిల్లలను కన్న తల్లిదండ్రులకు లక్ష రూపాయల నగదు బహుమతిని ఇస్తాను. ఎక్కువ మంది పిల్లల్ని కనండి రూ. లక్ష గెలుచుకోండి' అంటూ ఓ ఆఫర్‌ను ప్రకటించారు. దీంతో ఇది కాస్తా తీవ్ర చర్చనీయాంశమైంది. ఓ వైపు జనాభా నియంత్రణ కోసం ప్రభుత్వాలు కృషి చేస్తోంటే, ఏకంగా ఓ మంత్రి ఇలా మాట్లాడటం ఏంటని వార్తలు వచ్చాయి. ఆ డబ్బును ప్రభుత్వమే ఇస్తుందా.? అని కూడా నిలదీసినంత పనిచేశాయి. దీంతో ఈ విషయమై రాబర్ట్ స్పందించారు. 'మిజోరాంలో ప్రజల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. మిజోరాం ప్రకృతి అందాలకు ప్రతీక. అలాంటి మిజోరాంను అభివృద్ధి చేయగలిగేంత స్థాయిలో మిజోల సంఖ్య లేదు. మిజోల లాంటి చిన్న చిన్న తెగల్లో జనాభా తగ్గిపోతోంది. అందుకే మిజోల సంఖ్యను పెంచేందుకు, ఆయా తెగల్లో ప్రజల సంఖ్యను పెంపొందించేందుకు నేను ఈ ప్రకటన చేశాను. ఇందుకోసం ప్రభుత్వం నుంచి డబ్బును వాడబోము. నా కుమారుడి కంపెనీ నుంచి వచ్చే లాభాలనే ఈ స్కీమ్‌ను వాడతాము' అని రాబర్ట్ క్లారిటీ ఇచ్చారు. కాగా, ఎక్కువ మంది కనండి అని మంత్రి అన్నారే కానీ, గరిష్టంగా ఎంత మంది అని మాత్రం చెప్పకపోవడం గమనార్హం.

2011 జనాభా లెక్కల ప్రకారం మిజోరాం జనాభా 10 లక్షల 91వేల 14 మంది మాత్రమే. 21,087 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న మిజోరాం రాష్ట్రంలో ఒక చదరపు కిలోమీటరుకు 52 మంది జనాభా మాత్రమే నివసిస్తున్నారు. అత్యల్ప జనాభా కలిగిన రాష్ట్రాల్లో అరుణా చల్ ప్రదేశ్ తర్వాత మిజోరాం రాష్ట్రమే ఉంది. కాగా, మిజోరాం పక్కన ఉన్న అస్సాం మాత్రం ఇందుకు భిన్నమైన మార్గంలో వెళ్తోంది. జనాభా నియంత్రణకు కఠిన నిబంధనలను అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబాలకు మాత్రమే కొన్ని రకాల ప్రభుత్వ పథకాలు అందుతాయంటూ ఇటీవలే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ ప్రకటించారు. 2021 జనవరి నుంచి ఆ రాష్ట్రంలో కేవలం ఇద్దరు పిల్లలు లోపు ఉన్న వారు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులు.

సీఎంగారు మళ్ళా కరోనాకు పారాసిటమాల్ చాలంటున్రు: విజయశాంతి

హైదరాబాద్ , జూన్ 22:తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మరోసారి బీజేపీ నేత విజయశాంతి సెటైర్ వేశారు. అచ్చమైన తెలంగాణ భాషలో సీఎం కేసీఆర్‌పై విరుచుకుపడ్డారు. "ముఖ్యమంత్రి కేసీఆర్ గారు మళ్ళా కరోనాకు పారాసిటమల్ చాలంటున్రు. జయశంకర్ గారి వర్ధంతిని జయంతి అంటున్రు. దళిత ముఖ్యమంత్రి, 3 ఎకరాల భూమి ఊసెత్తకుండా ఇప్పుడు దళిత సాధికారత అని కొత్త అబద్ధాలు మాట్లాడుతున్నరు అని విమర్శించారు.

డల్లాస్, చికాగో, న్యూయార్క్, ఇస్తాంబుల్ వాగ్దానాల యాది మరిచి, ఇప్పుడు కొత్తగా కెనడా హాస్పిటల్ అంటున్రు. వీటిలో ఏ ఒక్కటీ ఇంతకుముందు జరగలేదని ఎద్దేవా చేశారు విజయశాంతి. ధనిక రాష్ట్రం అని చెప్పున్న ఈ సీఎం గారు, మరి పైసలున్నప్పుడు గవన్నీ ఎందుకు చెయ్యలేదు? కేవలం చేసేది ఇష్టం లేకనా? కాదంటే నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నట్లా? వరంగల్ ఐటీ హబ్ అన్నరు? డబుల్ బెడ్రూం ఇళ్ళన్నరు? కుర్చీ వేసుకు కూర్చుని పూర్తి చేసి కల్లు తాగి దావత్ చేసుకుంటానన్నరు? ఇవన్నీ ఏమైనవో తెల్వదు. ఇప్పుడు మళ్లా తుగ్లక్ తీరున ఈ వాగ్దానాలు. తెలంగాణ ప్రజలు అమాయకులనా? లేక ఈ సీఎం గారి మానసిక పరిస్థితి సరిలేక ఇదంతా జరుగుతున్నదా?.. అని ప్రజలకు అనుమానాలు వస్తున్నాయి. అసలు అమలు కాని, అమలు చెయ్యని ఇలాంటి అవకతవక, అనాలోచిత హామీలు ఇచ్చుకుంటూ కేసీఆర్ గారు జిల్లాలు పర్యటించుడు? వారి ఆలోచన సమతుల్యతను సందేహించాల్సినట్లుందనే అభిప్రాయాలు తెలంగాణ సమాజంలో బలపడుతున్నాయని విమర్శించారు.

బిల్లులు చెల్లించేందుకు నిధులు లేవని చెప్పడం సరికాదు: హైకోర్టు

అమరావతి, జూన్ 22:ఏపీ ఆర్థిక పరిస్థితిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పలు పనులకు సంబంధించి బిల్లులు చెల్లించేందుకు నిధులు లేవని చెప్పడంపై మండిపడింది. సకాలంలో బిల్లులు చెల్లించకపోతే మూడు రాజధానుల నిర్మాణానికి ఎవరు ముందుకు వస్తారని ప్రశ్నించింది. హైకోర్టు ముందు హాజరు కావాలని ఆర్థిక, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించలేదంటూ చిత్తూరు, తూ.గో జిల్లాకు చెందిన యర్రంరెడ్డి, ఆర్.శ్రీనివాసరావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో నిధులు లేక బిల్లులు చెల్లించలేదని ప్రభుత్వ న్యాయవాది చెప్పడంతో హైకోర్టు సీరియస్ అయ్యింది.

వందేళ్ళలో భారత్ సాధించింది 28 ఒలంపిక్ పతకాలే

(23 జూన్ 'అంతర్జాతీయ ఒలంపిక్ దినం' సందర్భంగా)

23 జూన్ 1894న కెనడా, ఆస్ట్రియ, యుకె, బెల్జియమ్, గ్రీస్, పోర్చుగల్, స్విట్జర్లాండ్, ఉరూగ్వే మరియు వెవేజులా అనబడే తొమ్మిది దేశాలు ఏర్పాటు చేసిన నేషనల్ ఒలంపిక్ కమిటీ సారథ్యంలో అంతర్జాతీయ ఒలంపిక్ దినం నిర్వహించడం ప్రారంభించారు. వయసు, కులమతాలు, ప్రాంతాలు, లింగ భేదాలు లేకుండా క్రీడల పట్ల ఆసక్తిని, అభిరుచుని పెంపొందించే సదుద్దేశంతో ప్రతి ఏట 23 జూన్ రోజున ప్రపంచ దేశాలన్నీ అంతర్జాతీయ ఒలంపిక్ దినం పాటించుట జరుగుతున్నది. ప్రతి ఒక్కరు క్రీడల ప్రాముఖ్యతను గ్రహించి శారీరక, మానసిక వికాసం కోసం దైనందిన జీవితంలో అవుట్ డోర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పట్ల ఆసక్తిని చూపాలి. కరోనా మహమ్మారి కల్లోలంలో శారీరక చురుకుదనం, మానసిక దృఢత్వ వేటలో క్రీడలకు కొంత సమయం/చోటు ఇవ్వడం ద్వారా వ్యాధినిరోధకశక్తిని పోగుచేసుకోవాలి. అంతర్జాతీయ ఒలంపిక్ కమిటీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తూన్న అంతర్జాతీయ ఒలంపిక్ దినం-2021 నినాదంగా 'దినచర్యలో శారీరక చురుకుదనాన్ని చూపుదాం' అంశాన్ని తీసుకొని 24-గంటల ఆన్‌లైన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. క్రీడల ద్వారా అంతర్జాతీయ సమైక్యత, మానవాళి ఏకీకరణ, శారీరక క్రియాశీలత, మానసిక పటుత్వం సాధించే వేదికల్లో క్రీడలు అతి ముఖ్యమైనవని గమనించాలి. అంతర్జాతీయ ఆధునిక ఒలంపిక్ కమిటీ తొలి అధ్యక్షుడు 'చార్లెస్ పెరీ డి ఫ్రెడీ' నియమించబడడంతో పాటు తన అవిరళ కృషిని గుర్తించిన సమాజం ఆయనను 'ఆధునిక ఒలంపిక్ క్రీడల పితామహుడి'గా పిలుస్తున్నాం.

అంతర్జాతీయ క్రీడా సంబరంగా పిరపంచ మానవాళికి స్ఫూర్తిని కలిగించే ప్రయత్నంలో భాగంగా 23 జూన్ 1987 నుంచి 150 దేశాల జాతీయ ఒలంపిక్ కమిటీల నేతృత్వంలో పురుష, మహిళ మరియు పిల్లల్ని ఒక చోటుకు చేర్చే వేదికగా ప్రతి ఏట అంతర్జాతీయ ఒలంపిక్ దినం సందర్భంగా 'ఒలంరిక్ డే రన్' నిర్వహించుట ఆనవాయితీగా వస్తున్నది. అంతర్జాతీయ ఒలంపిక్ దినం వేదికగా క్రీడా, సాంస్కృతిక వేడుకలతో పాటుగా సెమినార్లు నిర్వహించుట జరుగుతుంది. ఒలంపిక్ డే ప్రాథమిక సూత్రాలుగా క్రీయాశీలత (మూవ్), నేర్చుకోవడం (లెర్న్), కనుగొనుట (డిస్కవరీ) అనబడే 3 ముఖ్య అంశాలు చేర్చబడ్డాయి. 'క్రియాశీలత'లో శారీరక పటుత్వం కలుగుటకు అవకాశం ఉంటుంది. 'నేర్చుకోవడం' అనే అంశంలో మానవీయత, అంటువ్యాధుల కట్టడి, విద్య, మానవ అక్రమ రవాణ, మహిళా సాధికారత, ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ, శాంతి స్థాపన, సమాజాభివృద్ధి, స్నేహ విస్తరణ, మానవాళిని గౌరవించడం అనే భావనలు ప్రచారం చేసే అంశాలు అమిడి ఉంటాయి. 'కనుగొనడం' అనే అంశంలో భాగంగా క్రీడావ్యాప్తికి కంకణ బద్ధులు కావడం, లింగ వివక్షకు తావులేకుండా చూసుకోవడం, అన్ని వయస్సులు, వర్గాల వారిని ప్రోత్సహించడం లాంటి జాగ్రత్తలు తీసుకుంటారు. అమెరికాలో 60-65 శాతం (దాదాపు 160 మిలియన్లు) ప్రజలు స్థూలకాయ సమస్యలతో బాధ పడుతున్నారు. సబ్-సహారా ఆఫ్రికన్ ప్రాంతంలో 237 మిలియన్ల ప్రజలు పోషకాహార లోపంతో నరకం అనుభవిస్తున్నారు. ఓలంపిక్ డే వేదికలో క్రీడలు మాత్రమే కాకుండా సామాజికాభివృద్ధి అంశాలు కూడా చర్చించడం జరుగుతుంది. 2వ ప్రపంచ యుద్ధం కారణంగా 1940, 1944లలో ఒలంపిక్ క్రీడలు నిర్వహించలేదు.

1900 సంవత్సరంలో నిర్వహించిన పారిస్ ఓలంపిక్స్ నుంచి ఇండియా ఓలంపిక్ క్రీడల్లో పాలుపంచుకుంటూ అథ్లెటిక్స్‌లో ఏకైక క్రీడాకారుడు నార్మన్ ప్రిచ్చర్డ్ ఏసియాలోనే తెలిసారి రెండు వెండి పథకాలు గెలవడం జరిగింది. ఇప్పటి వరకు భారత క్రీడాకారులు 9 బంగారు, 7 వెండి, 12 రజత పతకాలు మాత్రమే గెలవడం జరిగింది. 1920 నుంచి సమ్మర్ ఒలంపిక్స్, 1964 నుంచి వింటర్ ఒలంపిక్ క్రీడల్లో భారత జట్లు పాల్గొంటున్నాయి. 'సర్ దొరాబ్జీ టాటా' చొరవతో 1923-24లో ఏర్పడిన ఇండియన్ ఒలంపిక్ కమిటీ నేతృత్వంలో 138 కోట్ల దేశ జనాభా కలిగిన దేశంలో గత శతాబ్దకాలంలో 28 ఒలంపిక్ పతకాలు మాత్రమే గెలవడం అత్యంత విచారకరం. అదే క్రమంలో 33.3 కోట్ల జనాభా మాత్రమే కలిగిన అమెరికా నేటి వరకు 2,522 ఒలంపిక్ పతకాలు గెలుపొందడం గమనించాలి. 2048లో భారతదేశం ఓలంపిక్ మరియు పారా ఓలంపిక్ క్రీడలు నిర్వహించేందుకు సంసిద్ధతను వ్యక్తం చేస్తూ, తన గట్టి ప్రయత్నాలను ప్రారంభించింది. మన దేశంలో 34 రాష్ట్ర ఓలంపిక్ సంఘాలు, రైల్వే మరియు సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డులు ఉన్నాయి. ప్రస్తుతం 38 జాతీయ క్రీడా ఫెడరేషన్లు సభ్యులుగా ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్ పని చేస్తున్నది. రాష్ట్ర ఓలంపిక్ అసోసియేషన్ పరిధిలో జిల్లా ఓలంపిక్ అసోసియేషన్లు చురుకైన క్రీడా బాధ్యతలను నిర్వహిస్తున్నాయి. రెండవ అత్యధిక జనాభా కలిగిన యంగ్ ఇండియాలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, వసతుల లేమి, మౌళిక వనరుల కొరత, ప్రోత్సాహం కొరవడడం, మితిమీరిన రాజకీయ జోక్యం లాంటి కారణాలతో ఓలంపిక్స్‌లో పూర్తి జట్లు పాల్గొంటున్నప్పటికీ పతకాల పంట పండకపోవడం అత్యంత బాధాకరం. ప్రపంచంలోనే అతి పెద్ద యువశక్తి కలిగిన యువ భారత్‌లో యువత క్రీడల పట్ల ఆసక్తి కనబర్చి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరుకుందాం. ఈ లక్ష్యంతో ఇండియన్ ఒలంపిక్ అసోసియోషన్ నిస్పక్షపాతంగా వ్యవహరిస్తూ, భారతదేశ కీర్తిని క్రీడా వేదికల మీద ఇనుమడింప చేయాలని కోరుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

టాయికథన్-2021 లో పాలుపంచుకొంటున్న వారితో ఈ నెల 24న మాట్లాడనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 22:కొత్త కొత్త ఆట వస్తువుల ను, ఆట ల తాలూకు ఉపాయాల ను వివిధ సమూహాల ద్వారా సమకూర్చడం కోసం టాయికథన్-2021 ని ఈ సంవత్సరం జనవరి 5న విద్య మంత్రిత్వ శాఖ, మహిళలు బాలల వికాసం మంత్రిత్వ శాఖ, ఎమ్ఎస్ఎమ్ఇ మంత్రిత్వ శాఖ, డిపిఐఐటి, జౌళి మంత్రిత్వ శాఖ, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ లతో పాటు, ఎఐసిటిఇ లు కలసి మొదలు పెట్టాయి. టాయికథన్-2021 లో పాలుపంచుకొనేందుకు భారతదేశం లోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 1.2 లక్షల మంది ముందుకు వచ్చి నమోదులు చేసుకొని, 17,000కు పైగా ఉపాయాల ను దాఖలు చేశారు.

వాటి లో నుంచి 1567 ఉపాయాల ను జూన్ 22 మొదలుకొని జూన్ 24 వరకు ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా నిర్వహించే టాయికథన్ గ్రాండ్ ఫినాలి కోసం తాత్కాలికం గా ఎంపిక చేయడమైంది. కోవిడ్-19 ఆంక్ష ల కారణం గా, ఈ డిజిటల్ మాధ్యమానికి అనువైనటువంటి టాయి ఐడియాస్ ను దాఖలు చేసిన జట్ల ను మాత్రమే గ్రాండ్ ఫినాలి లో అవకాశం కల్పించడం జరిగింది. డిజిటల్ మాధ్యమం కోవ కు చెందనటువంటి ఆటవస్తువుల ఉ పాయాల ను సమర్పించిన అభ్యర్థుల కు విడి గా ఓ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు.

భారతదేశం లోని దేశవాళీ బజారు తో పాటు ప్రపంచ ఆట వస్తువుల బజారు ఒక భారీ అవకాశాన్ని మన తయారీ రంగాని కి ఇవ్వజూపుతోంది. భారతదేశం లోని ఆటవస్తువుల తయారీ పరిశ్రమ కు ప్రోత్సాహాన్ని అందించి, ఆ పరిశ్రమ ఆటబొమ్మల బజారు లో ఒక విస్తృతమైన వాటా ను చేజిక్కించుకోవడం లో సాయపడాలి అనేది టాయికథన్-2021 ధ్యేయం గా ఉంది.

అంతర్జాతీయ యోగా దినోత్సవం-2021ని జరుపుకున్న సిఎస్ఐఆర్-ఎన్ఐఎస్‌సిపిఆర్



న్యూఢిల్లీ, జూన్ 22:సిఎస్ఐఆర్-నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ అండ్ పాలసీ రీసెర్చ్ (ఎన్ఐఎస్‌సిపిఆర్), 2021 జూన్ 21 న నిర్వహించిన 7 వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, సిబ్బంది, భాగస్వాములు, విద్యార్థులు, సైన్స్ ప్రేమికులు, కమ్యూనికేటర్లు ఉత్సాహంతో పాల్గొన్నారు. పేస్ బుక్ లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఈ కార్యక్రమాన్ని వర్చువల్ గా నిర్వహించారు.

సిఎస్ఐఆర్-ఎన్ఐఎస్‌సిపిఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రంజనా అగర్వాల్ ప్రారంభోపన్యాసం చేస్తూ, మానవులకు యోగా అనేక విధాలుగా ముఖ్యమని, భారతీయ జ్ఞాన వ్యవస్థ మన శరీరాన్ని మన మనస్సు, ఆత్మ కలుపుతుందని అన్నారు. ఆయుర్వేదం, యోగా, ప్రకృతివైద్యం, పోషణ మన గొప్ప భారతీయ జ్ఞాన వ్యవస్థ గొడుగు కిందకు వస్తాయి. వినాశకరమైన కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొంటున్నప్పుడు, ప్రతి ఒక్కరూ కోవిడ్-19 వ్యాధితో పాటు భయం, ఆందోళన, మానసిక సంక్షోభం, ఒత్తిడి మరియు నిరాశను ఎదుర్కొంటారు. అటువంటి ప్రయత్న సమయంలో, యోగా, ఆయుర్వేదాలను మహమ్మారిపై పోరాడటానికి సమర్థవంతమైన సాధనంగా ప్రపంచ దేశాలు పరిగణించాయి. ఐక్యరాజ్యసమితి కూడా మానసిక ఆరోగ్యానికి యోగా ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావించింది. యోగా ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చు. అని ప్రొఫెసర్ రంజనా అగర్వాల్ అన్నారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ సిసిఆర్‌వైఎన్, నాద యోగా నిపుణుడు డాక్టర్ నవ్‌దీప్ జోషి ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరికీ మానసిక చైతన్యాన్ని నింపి యవ్వనంగా మారుస్తుంది అని అన్నారు. యోగా మన అంతరంగంతో పరిచయం చేస్తుంది. 'మెదడు' అయిన మన మేధో శరీరాన్ని నియంత్రించడానికి ధ్యానం, యోగా ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. యోగాను సైన్స్ తో అనుసంధానిస్తూ వైబ్రేషన్, సౌండ్, ఎనర్జీ, క్వాంటం మెకానిక్స్ ప్రాముఖ్యతను చెప్పారు. 'ఆ', 'యు', 'ఓం' శబ్దాలు మెదడులో కంపించి నాడీ వ్యవస్థను, మన శరీరమంతా శుద్ధి చేస్తాయి అన్నారు. 'నాద' యోగా రూపం, మన జీవితాలలో ఉనికిలో దాని ప్రాముఖ్యతను వివరించారు. ఈ నిర్దిష్ట యోగా రూపం ప్రకృతి శబ్దాలతో వ్యవహరిస్తుంది. అతను నాద యోగాను ధ్వని ఆధారంగా 'అనాహత' (అంతర్గత ధ్వని) మరియు 'అహతా' (బాహ్య ధ్వని) గా వర్గీకరించారు. శబ్దాల ఈ వైవిధ్యం ప్రపంచంలోని వివిధ భాషలకు పునాది. చివరగా, యోగా మనల్ని అంతర్ముఖ ప్రయాణానికి తీసుకువెళుతుందనే వ్యాఖ్యలతో ఆయన తన ఉపన్యాసాన్ని ముగించారు.

ఈ కార్యక్రమంలో యోగాచార్య మంజారి మన దేహంలో నిబిడీకృతమై ఉన్న శక్తి గురించి వివరించారు. మన శరీరంలో అంతర్గత శక్తి ఉందని, ఇది మన మనస్సులో సానుకూల ఆలోచనలను తెస్తుందని ఆమె అన్నారు. యోగా భాషలో, మానవ శరీరం అగ్ని, వాయు, ఆకాష్, పృథ్వీ, జల్ అనే ఐదు ప్రాథమిక అంశాలతో రూపొందించబడింది. ఈ అంశాలు మన శరీరంలో సామరస్యంగా లేనప్పుడు, వ్యాధి జనిస్తుందని అన్నారు.

శ్రీమతి మంజారి ధ్యానంపై జరిగిన ఒక సెషన్ ను సమన్వయపరిచారు. సిఎస్ఐఆర్-ఎన్ఐఎస్‌సిపిఆర్ సైంటిస్ట్ మనీష్ మోహన్ గోరే ఈవెంట్ మరియు ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని మోడరేట్ చేశారు. సిఎస్ఐఆర్-ఎన్ఐఎస్‌సిపిఆర్ శాస్త్రవేత్త డాక్టర్ పరమానంద్ బార్మాన్ ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని సమన్వయపరిచారు.

మహిళల ఖాతాల్లో రూ.4,339.39 కోట్లు జమ

అమరావతి, జూన్ 22:ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 45-60 ఏళ్ల వయసు అక్క చెల్లెమ్మలకు రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.18,750 చొప్పున ఆర్థిక సహాయం అందించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మంగళవారం క్యాంపు కార్యాలయంలో వరుసగా రెండో ఏడాది 23,14,342 మంది మహిళలకు రూ.4,339.39 కోట్ల ఆర్థిక సాయాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మట్లాడుతూ.. వైఎస్ఆర్ చేయూత ద్వారా 23.14 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందని, మహిళల ఖాతాల్లో రూ.4,339.39 కోట్లు జమ చేశామన్నారు. 45-60 ఏళ్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏటా రూ.18,750 సాయం అందిస్తున్నామని తెలిపారు.

నాలుగేళ్లలో రూ.75వేల చొప్పున సాయం చేసే గొప్ప కార్యక్రమం అని, ప్రతి కుటుంబానికి మహిళలే రథసారథులు సీఎం జగన్ అన్నారు. వైఎస్ఆర్ చేయూత ద్వారా రెండేళ్లలో రూ.9వేల కోట్ల సాయం, ఆర్థిక సాయంతో పాటు జీవనోపాధికి తోడ్పాటు అందిస్తున్నామని సీఎం జగన్ అన్నారు. అమూల్, రిలయన్స్, పీ అండ్ జీ, ఐటీసీ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామని, 78వేల మంది అక్కచెల్లెమ్మలు కిరాణా షాపులు పెట్టుకోగలిగారని సీఎం జగన్ తెలిపారు. లక్షా 19వేల మహిళలు ఆవులు, గేదెలు కొనుగోలు చేశారని, లీటర్ పాలకు అదనంగా రూ.15 వరకు లబ్ధి జరిగేలా కార్యాచరణ చేపట్టామని తెలిపారు. కంపెనీలు, బ్యాంకులతో లబ్ధిదారుల అనుసంధానంపై కాల్ సెంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

కేబినెట్‌లోనూ మహిళలకు ప్రాధాన్యతఇచ్చామని, దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళలకు నామినేటెడ్ పదవులను కేటాయించామని సీఎం జగన్ అన్నారు. ప్రతి రంగంలో అధిక శాతం మహిళలకు ప్రాతినిధ్యం కల్పించామని, వారి కోసం దిశ, అభయం యాప్ తీసుకొచ్చామని తెలిపారు. మహిళల రక్షణ కోసం దిశ చట్టం చేశామని, వారి రక్షణకై దిశ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయంలో మహిళా పోలీసులను నియమించామని, వారికోసం ప్రత్యేకంగా 900 మొబైల్ టీమ్స్ ఏర్పాటు చేశామని సీఎం జగన్ చెప్పారు.

45 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున వరుసగా నాలుగేళ్లలో మొత్తం రూ.75,000 ఆర్థిక సాయం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. నాలుగేళ్లలో ఈ పథకం ద్వారా మహిళలకు దాదాపు రూ.19,000 కోట్లు అందజేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

మొదటి, రెండో విడతలో కలిపి రూ.8,943 కోట్ల మొత్తం అక్క చెల్లెమ్మలకు అందజేసినట్లు అయింది. ఇప్పటికే 78వేల మందికి ఏపీ ప్రభుత్వం కిరాణా షాపులు పెట్టించింది. కిరాణా షాపుల ద్వారా ఒక్కో మహిళకు రూ.10వేల వరకు అదనపు ఆదాయం రానుంది. 1,90,517 మందికి ప్రభుత్వం గేదెలు, ఆవులు, మేకలు అందించింది. లీటర్ పాలకు అదనంగా రూ.5 నుంచి రూ.15 వరకు లబ్ధి చేకూరుతోంది.

ఈ పథకం ద్వారా అందజేసే డబ్బులను ఉపయోగించుకోవడంలో మహిళలకు పూర్తి స్వేచ్ఛనిస్తూనే వారి జీవనోపాధి మార్గాలను మెరుగుపరుచుకునేందుకు ప్రభుత్వం తోడ్పాటు అందజేస్తోంది. ఈ ఆర్థిక సహాయంతో మహిళలు కిరాణా షాపులతోపాటు గేదెలు, ఆవులు, మేకలు లాంటి జీవనోపాధి మార్గాలను ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకుల ద్వారా రుణం పొందేందుకు తోడ్పాటు అందజేస్తారు. ఈ వ్యాపారాలలో మహిళలకు ఎక్కువ లాభాలు దక్కేలా అమూల్, హెచ్‌యూఎల్, రిలయెన్స్, పీఅండ్‌జీ, ఐటీసీ లాంటి దిగ్గజ సంస్థలు, బ్యాంకులతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులు వర్చువల్ విధానంలో పాల్గొనేలా ప్రతి గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ల కార్యాలయం నుంచి మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టీఎస్ ఎడ్‌సెట్ దరఖాస్తు గడువు పెంపు

హైదరాబాద్ : టీఎస్ ఎడ్‌సెట్ దరఖాస్తు గడువు మరోమారు పొడిగింపబడింది. అలస్య రుసుం లేకుండా టీఎస్ ఎడ్‌సెట్-2021 దరఖాస్తు గడువును జూన్ 30వ తేదీ వరకు అధికారులు పొడిగించారు. అంతకుక్రితం జూన్ 22 చివరితేదీగా ఉన్నది. అభ్యర్థులు https://edcet.tsche.ac.in/. వెబ్‌సైట్‌కి లాగిన్ దరఖాస్తు చేసుకోవచ్చు. బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష ఆగస్టు 24, 25న జరగనుంది.

వచ్చే వారం నుంచి ఇండియాకు ఎమిరేట్స్ విమాన సర్వీసులు..

న్యూఢిల్లీ, జూన్ 22:దేశంలో కరోనా విజృంభణ కారణంగా నిలిచిపోయిన విమాన సర్వీసులు మళ్లీ మొదలుకానున్నాయి. మన దేశంలో వైరస్ ప్రభావం అంతకంతకూ తగ్గుతున్న నేపథ్యంలో యునైటెడ్ ఎమిరేట్స్‌కు చెందిన విమానయాన సంస్థ ఎమిరేట్స్ వచ్చే వారం నుంచి సేవలను పునరుద్ధరించేందుకు సిద్ధమైంది. భారత ప్రయాణికులు వారి రెసిడెన్స్ వీసాతోపాటు యూఏఈ ధ్రువీకరించిన రెండు కరోనా టీకా డోసులను తీసుకున్న వారికి ఎమిరేట్స్ విమానంలో ప్రయాణించేందుకు అనుమతి లభిస్

కొవాగ్జిన్ సామర్థ్యం 77.8 శాతం!

న్యూఢిల్లీ, జూన్ 22:ఇప్పటికే అన్ని కరోనా వైరస్ వేరియంట్లపై సమర్థంగా పని చేస్తున్నట్లు కొవాగ్జిన్‌కు సర్టిఫికెట్ ఇచ్చాయి పలు అధ్యయనాలు. తాజాగా ఈ వ్యాక్సిన్ తయారు చేసిన భారత్ బయోటెక్ కూడా ఈ వ్యాక్సిన్ మూడో దశ ట్రయల్స్‌కు సంబంధించిన ఫలితాలను డీసీజీఐకి చెందిన ఎక్స్‌పర్ట్ కమిటీకి సమర్పించింది. దీనిపై కమిటీ పరిశీలన జరిపి ఆమోదించింది. అయితే మూడో దశ ప్రయోగాల్లో కొవాగ్జిన్ సామర్థ్యం 77.8 శాతంగా తేలినట్లు సమాచారం.

దివిటిపల్లిలో డబుల్ బెడ్రూం ఇండ్లు ప్రారంభం

మహబూబ్‌నగర్, జూన్ 22:: మహబూబ్ నగర్ పట్టణంలోని దివిటిపల్లిలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను మంత్రులు శ్రీనివాస్ గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి కలిసి ప్రారంభించారు. డబుల్ బెడ్రూం ఇండ్లకు నీటి సరఫరాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. దివిటిపల్లిలో 1,024 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించారు. లబ్దిదారులు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని భావోద్వేగానికి లోనయ్యారు. కేసీఆర్ వల్లే తమ సొంతింటి కల నిజమైందని ఆనంద భాష్పాలు రాల్చారు.

మరదలిపై కన్నేసి కుటుంబాన్ని కాటేసి ఆపై..

ముంబై, జూన్ 22:: మహారాష్ట్రలోని నాగపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. మరదలిపై కన్నేసిన వ్యక్తి ఆమె లొంగకపోవడంతో మరదలుతో పాటు తన భార్య ఇద్దరు పిల్లలు, అత్తను దారుణంగా చంపి ఆపై తాను బలవన్మరణానికి పాల్పడిన ఘటన గోలీబార్ చౌక్ లోని నిందితుడి ఇంట ఆదివారం రాత్రి వెలుగుచూసింది. వాచ్‌మెన్‌గా పనిచేసే నిందితుడి మామ దేవిదాస్ విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్నఅనంతరం ఈ ఘోరం బయటపడింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు అలోక్ మతుర్కర్ కొన్నేండ్ల కిందట విజయతో వివాహమైంది. వీరికి పరి, సాహిల్ అనే ఇద్దరు సంతానం కాగా విజయ సోదరి అమిషా బోబ్డే ఇటీవల మతుర్కర్ నిర్వహించే టైలరింగ్ పనిలో అతడికి చేదోడువాదోడుగా ఉంటోంది. ఈ క్రమంలో మరదలిపై కన్నేసిన మతుర్కర్ ఆమెను లైంగికంగా వేధించేవాడు. ఆమె తన ఫ్రెండ్‌తో ఫోన్‌లో మాట్లాడుతుండగా అనుమానంతో వేధింపులకు గురిచేశాడు.

బావ ప్రవర్తనపై విసిగిన బాబ్డే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముందస్తు చర్యల్లో భాగంగా అతడిని అదుపులోకి తీసుకుని అనంతరం విడుదల చేశారు. మతుర్కర్ తీరుపై ఆదివారం రాత్రి తన అక్కతో బాబ్డే వాదనకు దిగడంతో ఆగ్రహంతో ఊగిపోయిన నిందితుడు మరదలు, భార్య, తన ఇద్దరు పిల్లలతో పాటు అత్తను అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. పదకం ప్రకారమే ఆన్‌లైన్‌లోకత్తులకు ఆర్డర్ ఇచ్చిన నిందితుడు ఉన్మాదిగా మారి కుటుంబ సభ్యులను పొట్టనపెట్టుకోవడంతో పాటు ఆపై తాను ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

తాడేపల్లి అత్యాచార బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం

గుంటూరు, జూన్ 22: జిల్లా తాడేపల్లి అత్యాచార బాధితురాలికి ఏపీ ప్రభుత్వం రూ. 5 లక్షల పరిహారం ప్రకటించింది. మంత్రులు తానేటి వనిత, సుచరిత సోమవారం నాడు బాధిత యువతిని పరామర్శించారు. అనంతరం వనిత మాట్లాడుతూ.. తాడేపల్లి అత్యాచార ఘటన దురదృష్టకరమని అన్నారు. బాధితురాలికి ప్రభుత్వం తరపు నుంచి ఇచ్చే రూ. 5 లక్షలతోపాటు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నుంచి రూ. 50 వేలు అందిస్తామన్నారు. ఇద్దరు నిందితులే ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారని పేర్కొన్న మంత్రి.. యువతి కాబోయే భర్తపై దుండగులు దాడిచేసి ఆభరణాలు కూడా లాక్కెళ్లిపోయారని చెప్పారు. ఫోన్ సిగ్నల్స్ ద్వారా 50 శాతం ఆధారాలను సేకరించినట్టు మంత్రి వనిత చెప్పారు.

కఠిన చట్టాలు అమలు చేస్తున్నప్పటికీ ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని హోంమంత్రి సుచరిత అన్నారు. వీలైనంత త్వరగా నిందితులకు సంకెళ్లు వేస్తామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిందితులు ఎంతటి వారైనా విడిచిపెట్టబోమన్నారు. తాడేపల్లి ఘటన జరిగిన ప్రాంతంలో ఇప్పటి వరకు 5 నేరాలు జరిగాయని, భవిష్యత్తులో జరగకుండా ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. నిందితులు బ్లేడుతో బాధితులను బెదిరించి వారి సెల్‌ఫోన్లు లాక్కున్నట్టు మంత్రి సుచరిత తెలిపారు.

ఢిల్లీ ప్రజలతో యోగాదినోత్సవంలో పాల్గొన్న డాక్టర్ హర్షవర్ధన్

"ఆధునిక యుగంలో యోగా ప్రచారానికి ప్రధాని పునాదులు వేశారు"

న్యూఢిల్లీ, జూన్ 22:కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖామంత్రి దాక్టర్ హర్షవర్ధ ఈరోజు తన నియోజకవర్గ ప్రజలతో కలిసి అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకున్నారు. కశ్మీరీ గేట్ సమీపంలోని మహారాజా అగ్రసేన్ పార్కులో జరిగిన యోగా ఉత్సవాల్లో పాలుపంచుకున్నారు.

సామాజిక దూరం పాటిస్తూ అతి కొద్దిమందితో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన యోగాభ్యాసం చేశారు. ఆరోగ్యానికి యోగాసనాలు అనే సందేశాన్ని ఇవ్వటం కోసం ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు పేర్కొంటూ, 7వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి దేశంలో ఇప్పటి కరోనా సంక్షోభం కారణంగా మరింత ప్రాధాన్యం చేకూరిందన్నారు. ఆందోళన, వత్తిడి లాంటివి తగ్గించటంలో యోగాసనాలకున్న ప్రాధాన్యం కారణంగానే కరోనా సమయంలో దీనికి మరింత ప్రాచుర్యం లభించిందన్నారు. కరోనా కారణంగా దూరంగా, ఒంటరిగా ఉంటున్న సమయంలో ఇది తోడుగా నిలిచి మానసిక స్థైర్యాన్ని కలిగించిందని డాక్టర్ హర్ష వర్ధన్ అభివర్ణించారు. .

కోవిడ్ నియమాల కారణంగా వేడుకలలో ఎలాంటి హడావిడీ లేకుండా చూస్తున్నప్పటికీ, సంపూర్ణ ఆరోగ్య సాధనలో భాగంగా యోగా ప్రాధాన్యం మాత్రం అనేక రెట్లు పెరిగిందన్నారు. ప్రధాని విశాల దృక్పథంతో యోగాకు కల్పించిన ప్రాచుర్యం కారణంగా దీనికి అంతర్జాతీయ గుర్తింపు, ప్రాధాన్యం లభించాయన్నారు. 2014 లో ఐక్యరాజ్య సమితి ఏటా జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవం పాటించాలని నిర్ణయించటం వెనుక ప్రధాని కృషి ఉందన్నారు. సమకాలీన యుగంలో యోగాను ప్రజాబాహుళ్యంలోకి తీసుకువెళ్లటానికి పునాదులు వేసిన ఘనత ప్రధానికే దక్కుతుందన్నారు.

తన హృదయంలో యోగాసనాలకు ఎప్పుడూ ప్రాధాన్యం ఉంటుందని చెబుతూ ఈ కోవిడ్ సంక్షోభ సమయంలో ఎదుర్కుంటున్న పని వత్తిడి నుంచి ఊరట పొందటానికి తాను ప్రాణయామం చేయటాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని నమ్మే వాళ్ళందరికీ యోగా అలాంటి మహాభాగ్యాన్ని కల్పిస్తుందని , ఆ విధంగా దీర్ఘ నిశ్వాసతో నడినప్పుడు తనకు కోవిడ్ లేదన్న ధీమా కలుగుతుందని అన్నారు.

కోవిడ్ కారణంగా ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబ సభ్యులకు ఆయన ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. యోగ, ప్రాణయామ తోబాటు అందరూ కోవిడ్ నియంత్రణకు అనుకూలమైన ప్రవర్తన అలవరచుకోవాలని దాక్టర్ హర్ష వర్ధన్ పిలుపునిచ్చారు. అదే సామాజిక టీకా గా అభివర్ణించారు. కుటుంబంలో టీకాకు అర్హులైన ప్రతి ఒక్కరూ టీకా తీసుకోవాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. మాస్కులు ధరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవటం, గుంపుల్లో కలవకపోవటం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

టీకాలను సార్వజనీనం చేస్తూ వయోజనులందరికీ ఉచితంగా అందుబాటులోకి తెచ్చినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబంలో 18 ఏళ్ళు పైబడిన వారందరూ టీకాలు వేయించుకునేలా చూడాలన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 28 కోట్ల డోసుల పంపిణీ జరగటం పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. టీకా మందు ఉత్పత్తి కూడా వేగం పుంజుకున్నదని గుర్తు చేస్తూ ఇకమీదట పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటుందన్న ధీమా వ్యక్తం చేశారు. అయితే, టీకాల విషయంలో సాగే ఎలాంటి తప్పుడు ప్రచారాన్నీ నమ్మవద్దని కూడా ఆయన హితవు పలికారు.

కోవిడ్-19 పై జరుగుతున్న పోరాటానికి సహకరిస్తున్న 'భెల్'

న్యూఢిల్లీ, జూన్ 22:కోవిడ్-19 మహమ్మారి రూపంలో ఎదురైన సమస్యను ఎదుర్కొని క్లిష్ట పరిస్థితి నుంచి గట్టెక్కడానికి జాతీయ స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలకు ' భెల్' (భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్) తనవంతు సహకారాన్ని అందిస్తూ ప్రజలను ఆదుకోవడానికి చర్యలను అమలు చేస్తోంది. భోపాల్, హరిద్వార్ లలో ఉన్న ' భెల్' యూనిట్లు తమ వద్ద ఉన్న వనరులతో తమ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలకు అవసరమైన మెడికల్ ఆక్సిజన్ సరఫరా చేశాయి.

' భెల్' హరిద్వార్ యూనిట్ రోజుకి 24,000 క్యూబిక్ మీటర్ల ఆక్సిజన్ ను ఉత్పత్తి చేయగల సామర్థ్యం కలిగి ఉంది. దీనిని ప్లాంట్ సొంత అవసరాల కోసం ఉత్పత్తి చేస్తున్నారు. అయితే, ఏప్రిల్ మధ్యలో ఆక్సిజన్ కు ఏర్పడిన కొరతను దృష్టిలో ఉంచుకుని రోజుకి 3,000 సిలిండర్లను ఆక్సిజన్ తో నింపగల సామర్థ్యాన్ని సమకూర్చుకుంది. వారం రోజుల రికార్డ్ వ్యవధిలో అన్ని వనరులను సమకూర్చుకుని సిబ్బంది సహకారంతో రేయింబవళ్లు పనిచేసి ' భెల్' ఈ సామర్థ్యాన్ని సమకూర్చుకుంది. ఈ ప్లాంట్ ఇప్పటివరకు ఆస్పత్రులు మరియు జిల్లా అధికారులు, పీఎస్‌యులు, ఉత్తరాఖండ్, యుపిలోని సాయుధ దళాలు మరియు ఎన్‌సిఆర్ ఢిల్లీ అవసరాలను తీర్చడానికి దాదాపు 67,000 సిలిండర్లు (3,87,000 క్యూఎంలకు పైగా) వైద్య ఆక్సిజన్‌ను సరఫరా చేసి వేలాది మంది ప్రాణాలను రక్షించడంలో తనవంతు సహకారాన్ని అందించింది.

ఇదేవిధంగా, ' భెల్' భోపాల్ ప్లాంట్ ఇప్పటివరకు 1,74,000 క్యూబిక్ మీటర్ల ఆక్సిజన్‌ను (26,000 సిలిండర్లకు పైగా) మధ్యప్రదేశ్ లోని కస్తూర్బా హాస్పిటల్, ఎయిమ్స్, మిలిటరీ హాస్పిటల్, రైల్వే హాస్పిటల్, పోలీస్ హాస్పిటల్‌తో పాటు వివిధ ప్రైవేట్ ఆసుపత్రులకు సరఫరా చేసింది.

వైద్య అవసరాల కోసం ఆక్సిజన్ సరఫరాకు పెరిగిన డిమాండ్ ను దృష్టిలో ఉంచుకుని ' భెల్' హైదరాబాద్ యూనిట్ 12 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఆక్సిజన్ ప్లాంటుకు అత్యవసర మరమ్మత్తులు సర్వీసింగ్ చేసి రికార్డు సమయంలో దీనిలో ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ ప్లాంట్ రోజుకి 2000 క్యూబిక్ మీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీనిని అవసరమైన ఆసుపత్రులకు సరఫరా చేస్తారు.

' భెల్' ఇతర యూనిట్లలో కూడా ఆక్సిజన్ ఉత్పత్తి సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. జాతీయ అవసరాలకు స్పందించడానికి ' భెల్' సిద్ధంగా ఉంది.

భారతదేశంలో అతిపెద్ద ఇంజనీరింగ్ మరియు ఉత్పాదక సంస్థలలో ' భెల్' ఒకటి. దేశ ఆర్థిక వ్యవస్థలో 180 ప్రధాన రంగాలకు అవసరమైన పరికరాల డిజైన్, ఇంజనీరింగ్, నిర్మాణం, పరీక్ష, కమీషనింగ్ మరియు సర్వీసింగ్ కార్యక్రమాలను ' భెల్' చేపడుతోంది.

జౌళి మంత్రిత్వ శాఖలో 7వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



న్యూఢిల్లీ, జూన్ 22:కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖలో ఈ రోజు 7వ అంతర్జాతీయ యోగా దినోత్సవపు వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమాన్ని మంత్రిత్వ శాఖ అధికారులు యోగాసనాల సాధనతో ప్రారంభించారు. ఇందులో కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ ఉపేంద్ర ప్రసాద్ సింగ్ ఇతర సీనియర్ అధికారులు పాల్గన్నారు. ఇందులో 150 మందికి పైగా అధికారులు పాల్గొన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇంటర్నేషనల్ నుండి శిక్షణపొందిన, ధ్రువీకరించబడిన యోగా ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో తమ యోగాసనాభ్యాసాన్ని సమన్వయం చేశారు. వీరికి తోడు జౌళి మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర అటాచ్డ్, సబార్డినేట్ కార్యాలయాలతో పాటు వివిధ చట్టబద్ధమైన సంస్థలు, ప్రభుత్వ రంగ విభాగాలు, ఇతరత్రా క్షేత్ర కార్యాలయాలు కూడా ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకున్నాయి. ఈ సంవత్సరం యోగా దినోత్సవం ఇతివృత్తం 'యోగా ఫర్ వెల్నెస్'.. ఇది శారీరక మరియు మానసిక శ్రేయస్సు కోసం యోగా సాధనపై దృష్టి పెడుతుంది. శ్రీ యు.పి. సింగ్ ఈ రోజూ యోగాసనాలు సాధన చేయవలసిన అవసరాన్ని ప్రధానంగా ఎత్తిచూపుతూ ప్రసంగించారు.

భారతదేశ గొప్ప వారసత్వానికి ప్రపంచ గుర్తింపు..

ఏడో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జౌళి, మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి స్మృతి జుబిన్ ఇరానీ ట్వీట్టర్‌లో ఒక సందేశంలో మాట్లాడుతూ "7 సంవత్సరాల నుండి ఈ రోజు వరకు అంతర్జాతీయ యోగా రోజు రూపంలో సంపూర్ణ శ్రేయస్సుకు భారతదేశ గొప్ప వారసత్వానికి ప్రపంచ గుర్తింపు లభించింది. 'యోగా ఫర్ వెల్నెస్' ఇతివృత్తం ఇప్పుడు గతంలో కంటే చాలా సందర్భోచితంగా ఉంది. మొత్తం మానసిక మరియు శారీరక దృఢత్వానికి మన దైనందిన జీవితంలో యోగాను అవలంబిద్దాం." అని అన్నారు.

ఢిల్లీలో పవార్..విపక్షపార్టీల సమావేశం

న్యూఢిల్లీ, జూన్ 22:ఢిల్లీలో ఎన్‌సీపీ నేత శరద్‌పవార్ ఆధ్వర్యంలో దేశంలోని వివిధ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. ప్రస్తుత రాజకీయ, ఆర్థిక పరిస్థితుల పై సమగ్రమైన చర్చ.. మిషన్ 2024 లక్ష్యం గానే సమావేశం జరుగుతున్నట్లు తెలుస్తోంది. మూడో ఫ్రంట్ ఏర్పాటు చేసేందుకు ఈ పార్టీలతో సమావేశం కాబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మొత్తం 15 పార్టీలు ఈ సమావేశానికి హాజరయినట్లు? తెలుస్తోంది. యూపీలో 2024 లోక్ సభ ఎన్నికల పై చర్చించే అవకాశం ఉంది. అంతే?కదు మోడీ ని దీటుగా ఎదురొ్కనేందుకు నేత కోసం కీలక సమావేశంలో చర్చించనున్నారు. బీజేపీని ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు అన్ని పక్షాలను ఏకం చేసేందుకు పవర్ తో ఇటీవల ప్రశాంత్ కి???షోర్ పలు మార్లు భేటీ అయ్యారు.

కానుకలు ఇవ్వడం.. అప్పులు తీసుకురావడం.. ఇదేనా పాలన?

అమరావతి, జూన్ 22:ఏపీ సీఎం జగన్‌పై ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు విమర్శలు గుప్పించారు. జగన్ విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ రాష్ట్రంలో దుమారం రేపిందని ఆయన అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారని, అన్ని చోట్ల నిరసనలు తెలుపుతున్నారని చెప్పారు. కానుకలు ఇవ్వడం? అప్పులు తీసుకురావడమే జగన్ వరిపాలన అని సోము వీర్రాజు దుయ్యబట్టారు. రైతులకు గిట్టుబాటు ధర లేదని? రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని బీజేపీ ఖండిస్తోందన్నారు. కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రంలో ఉపాధి వస్తుందంటే? దానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదని విమర్శించారు. విశాఖలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి అప్పులు తీసుకొస్తున్నారని? సొంత ఆస్తులను జగన్ ఎందుకు తాకట్టు పెట్టడం లేదని ప్రశ్నించారు. దేశంలో ఇలాంటి పాలనను ఎక్కడా చూడటం లేదన్నారు.

అశోక్ గజపతిరాజు కుటుంబం ఎన్నో దానధర్మాలు చేసిందని? అలాంటి అశోక్ రాజును విమర్శించే అర్హత వైసీపీ నేతలకు లేదని వీర్రాజు మండిపడ్డారు. అలాంటి వ్యక్తులపై విమర్శలు చేసేముందు వైసీపీ నేతలు వారి స్థాయిని దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. రాష్ట్రంలో అస్తవ్యస్తమైన పాలన కొనసాగుతోందని విమర్శించారు. విశాఖలో కొనసాగుతున్న భూకబ్జాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జగన్ విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ పై బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపడతామన్నారు.

మరో యుద్ధానికి సిద్ధం కావాలి : మంత్రి వేముల

మహబూబ్‌నగర్, జూన్ 22:: ఆంధ్రప్రదేశ్ జల దోపిడీని అడ్డుకొని తీరుతామని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తేల్చిచెప్పారు. రాయలసీమ ప్రాజెక్టును ఏపీ కొనసాగిస్తే.. తెలంగాణ ప్రజలు మరో యుద్ధానికి సిద్ధం కావాలని మంత్రి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని దివిటిపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి వేముల మాట్లాడారు.

ఎలాంటి అనుమతులు లేకుండా వైస్ జగన్ రాయలసీమ ఎత్తిపోతల చేపట్టారు అని ధ్వజమెత్తారు. జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అక్రమంగా పోతిరెడ్డిపాడు నుండి 40 వేల క్యూసెక్కులు దోచుకుపోయారు. పోతిరెడ్డిపాడు జల దోపిడీపై టీఆర్ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు మంత్రులు రాజీనామా చేస్తే అప్పటి కాంగ్రెస్ మంత్రి డీకే అరుణ వైయస్ అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నప్పుడు హారతులు పట్టారు అని మండిపడ్డారు.

ఎవరైనా ఆంధ్రవారు ఆంధ్రవారే అని కడిగిపారేశారు. వైఎస్ నీటి దొంగ అయితే ఆయన కొడుకు గజ దొంగ అని విమర్శించారు. దొంగతనంగా ప్రాజెక్టులు కడుతున్నారని ధ్వజమెత్తారు. రాయలసీమ, ఆర్డీఎస్ కుడి కాల్వ పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాయుద్ధం జరుగుతుందని హెచ్చరించారు. మా హక్కు నీటిని మీరు తీసుకోండి.. మా హక్కు నీటిని తీసుకుంటే సహించేది లేదు. తెలంగాణకు అన్యాయం జరిగితే సీఎం కేసీఆర్ ఊరుకోరు అని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తేల్చిచెప్పారు.

ఆర్ అండ్ ఆర్ కాలనీల్లోని ఇళ్లకు తక్షణమే కొత్త ఇంటి నంబర్లు కేటాయించాలి

-అధికారులను ఆదేశించిన బోయినపల్లి వినోద్ కుమార్

రాజన్న సిరిసిల్ల, జూన్ 22(నేటినిజం ప్రతినిధి): ఆర్ అండ్ ఆర్ కాలనీల్లోని ఇళ్లకు తక్షణమే కొత్త ఇంటి నంబర్ లను కేటాయించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయంలో మిడ్ మానేరు ప్రాజెక్టు పునరావాస గ్రామాలు, నిర్వాసితుల సమస్యలపై వినోద్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ గ్రామాల్లోని ఇళ్లకు కొత్త ఇంటి నంబర్ లను కేటాయించే ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కొత్త ఇంటి నంబర్లు లేక పునరావాస గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సమావేశంలో చర్చించారు. ప్రాజెక్టులో ముంపునకు గురైనా.. నోటిపై కాకుండా ఉన్న పలు గ్రామాల సమస్యలు దాదాపు పరిష్కారం అయినప్పటికీ, కొన్ని చిన్న చితక సమస్యలు వస్తున్నాయని, వాటిని కూడా వెంటనే పరిష్కరించాలని వినోద్ కుమార్ అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ అరుణ రాఘవ రెడ్డి, కలెక్టర్ కృష్ణ భాస్కర్, మున్సిపల్ చైర్ పర్సన్ జింధం కళా చక్రపాణి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, జెడ్పిటీసీ లు మ్యాకల రవి, ఉమా కొండయ్య, ఆర్డీఓ శ్రీనివాస్, ఆగయ్య, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఇళ్ల వద్దనే ఎరువుల పంపిణీ రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ కృష్ణదేవరావు

రాజన్న సిరిసిల్ల, జూన్ 22(నేటినిజం ప్రతినిధి): రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుద్రవరం సింగిల్విండో పరిధిలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశ్యంతో రైతుల ఇంటి వద్దకే వెళ్లి అడుగు మందు 20 20, యూరియా పంపిణీ చేస్తున్నారు . రుద్రవరం సొసైటీ పరిధిలోని అయ్యెరుపల్లెలోని రైతుల ఇంటి వద్దకే వెళ్లి యూరియా బస్తాలు పంపిణీ చేసినట్టు సింగిల్ విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు తెలిపారు . మంగళవారం రైతుల ఇంటివద్ద ఎరువులు అందిస్తున్న హమాలీలు రైతుల ఇంటి వద్దకే వెళ్లి ఎరువులు పంపిణీ చేశారు .ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దూర ప్రాంతానికి వెళ్లి ఎరువులు తెచ్చుకునే బాధ తప్పిందని సొసైటీ వారు పంపిణీ చేసిన సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కృష్ణదేవరాయలు , అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు . ఈ సందర్భంగా సొసైటీకి అన్ని విధాలుగా సహకరిస్తున్న రైతులకు హమాలీలకు , పాలకవర్గ సభ్యులతో అన్ని వేళల్లో అండగా ఉంటున్న స్థానిక ఎమ్మెల్యే రమేష్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే గండ్ర

జయశంకర్ భూపాలపల్లి, జూన్ 22:: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగాగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు నిరుపేదలకు వరంగా మారాయన్నారు. కల్యాణ లక్ష్మి వంటి పథకాలు దేశంలో మరెక్కడా లేవన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన వంద పడకల దవాఖానలో కావాల్సిన సిబ్బంది దాదాపు నలభై మందిని నియమించడానికి జీవో విడుదల చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రైతుల మేలు కోసమే రైతు వేదికలు

సంగారెడ్డి, జూన్ 22:: రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తూ వారి సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మానిక్‌రావు, ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని రేజింతల్, హద్నూర్, న్యాల్‌కల్, చాల్కి, హుస్సేనగర్, హుస్సేల్లి, మామిడ్గి గ్రామాల్లో రైతు వేదికలు, న్యాల్‌కల్‌లోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. హరితహారం పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లోని రైతు వేదిక పరిసరాల్లో మొక్కలను నాటారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో వారు మాట్లాడుతూ.. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని సీఎం గుర్తించారు. ఆ దిశగా వ్యవసాయ రంగానికి మొదట ప్రాధ్యాన్యతనిచ్చి వారికి అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారన్నారని తెలిపారు.

అందులో భాగంగానే దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటల నాణ్యమైన కరెంట్, రైతు బంధు, రుణ మాఫీ, రైతు బీమాను ప్రవేశపట్టి కంటికి రెప్పలా ప్రభుత్వం చూసుకుంటోందన్నారు. ఆయా గ్రామాల్లో నిర్మించిన రైతు వేదికలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతాయలన్నారు. సాగులో సమస్యలను రైతులు సమిష్టిగా చర్చించుకొని పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు.

అలాగే సంగమేశ్వర ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. బ్యాంకు అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని వారు సూచించారు.

కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

త్వరలో సోమశిల-సిద్ధేశ్వరం బ్రిడ్జి నిర్మాణం

కొల్లాపూర్/ నాగర్ కర్నూలు, జూన్ 22:: జిల్లాలోని కొల్లాపూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే సోమశిల- సిద్ధేశ్వరం వంతెన నిర్మాణం జరగాలని, ఇది కొల్లాపూర్ ప్రజల చిరకాల కోరిక కూడా అని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఎన్నికల హామీగా పేర్కొన్న సోమశిల- సిద్ధేశ్వరం బ్రిడ్జి నిర్మాణం త్వరలోనే సాకారం అవుతుందని ఆయన అన్నారు.

ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఎమ్మెల్యేగా విజయం సాధించి నప్పటి నుంచి కొల్లాపూర్ మండలం సోమశిల దగ్గర వంతెన నిర్మాణం అయితే వెనుకబడ్డ కొల్లాపూర్ ప్రాంతం రవాణా, విద్య, వైద్య, పారిశ్రామిక రంగాలలో అభివృద్ధి చెందుతుందని అసెంబ్లీలో ప్రస్తావించానని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో పాటు ఉన్నతాధికారుల దృష్టికి పలు మార్లు సమస్య తీసుకెళ్లి విజయం సాధించినట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా స్పందించి ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేశారని బీరం తెలిపారు. గత ఏడాది కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చర్చించి సోమశిల, సిద్ధేశ్వరం వంతెన నిర్మాణంతో పాటు జాతీయ రహదారి మంజూరు చేస్తూ జాతీయ రహదారిపై 167 ఎ నెంబరు కూడా ట్ మెంట్ చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు.

ఈ జాతీయ రహదారి, వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 610 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

రాజన్నను దర్శించుకున్న టి పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ గౌడ్

రాజన్న సిరిసిల్ల, జూన్ 22(నేటినిజం ప్రతినిధి): శ్రీ రాజరాజేశ్వర స్వామిని మంగళవారం కరీంనగర్ మాజీ ఎంపీ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ గౌడ్, టిపిసిసి కార్యదర్శి ఆది శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరోనా మహమ్మారి వల్ల అందరూ కోలుకొని కరోనాను జయించే శక్తిని ప్రతి ఒక్కరికి ఇవ్వాలని ఆ రాజన్న వేడుకోవడం జరిగిందని ఆయన అన్నారు. ఆయన వెంట డిసిసి అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, జిల్లా మహిళా కార్యదర్శి సగ్గు పద్మ, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మోడిగే చంద్రశేఖర్, చిలక రమేష్, నాయకులు నాగుల రాము గౌడ్,నాగుల విష్ణుప్రసాద్ , కనికరపు రాకేష్, చిలివెరీ శ్రీనివాస్ గౌడ్, కదిరి రాజ్ కుమార్,, రామ్ గోపాల్ రావు, అరుణ్ తేజ చారి, వస్తాది కృష్ణ, మేనీడే రాజు, భీమ్ రాజ్ కనకరాజు, తదితరులు ఉన్నారు

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవమువేడుకలు

రాజన్న సిరిసిల్ల, జూన్ 22(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్య కేంద్రంలో హిందూ సామ్రాజ్య దినోత్సవాని శ్రీ చత్రపతి శివాజీ పట్టాభిషేక మహోత్సవం) పునస్కరించుకొని ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి హిందూ సామ్రాజ్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు

వక్తలుమాట్లాడుతూమతమార్పిడులు గోహత్యలునిర్మూలించాలని మల్లీ శివాజీ మహారాజు పరిపాలించిన హిందూ రాజ్యం రావాలి కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ కార్యకర్తలు ,విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు పాల్గొన్నారు

తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం పని చేస్తున్నది..!

-రేగోడ్ మండలం సిందోల్ గ్రామ రోడ్డు పనులకు రూ.2.25 కోట్లు మంజూరు.

-త్వరలో ఎస్సీ నిరుద్యోగ యువత కోసం రూ. వెయ్యి కోట్లతో దళిత్ ఎంపవర్మెంట్ పథకం.

-రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలి.

-రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు..!

సంగారెడ్డి, జూన్ 21(నేటినిజం ప్రతినిధి) సోమవారం నాడు రేగోడ్ మండలం సిందోల్ గ్రామ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం సిందోల్ రోడ్డు పనులకు ప్రత్యేక జీవో ద్వారా రూ.2.25 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. రోడ్డు నిర్మాణం తో సిందోల్ గ్రామ ప్రజల ఇక్కట్లు తీరుతాయని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన మూడు నెలల లోపు రోడ్డు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని పంచాయతీరాజ్ ఎస్ఈ కి మంత్రి సూచించారు.

కరోనా తో రాష్ట్ర ఆదాయం తగ్గినా, రైతులకు సంబంధించిన ఏ సంక్షేమ పథకాన్ని ఆప లేదన్నారు. వానకాలం రైతుబందు కింద ఈ రోజు వరకు 7 ఎకరాల వరకు ఉన్న రైతులకు రైతుబంధు డబ్బులు వారి ఖాతాలో జమ చేసామన్నారు. 57 లక్షల 60 వేల 608 మంది రైతులకు రూ.6,012 కోట్ల 72 లక్షలు రైతుల ఖాతాలలో జమ చేసినట్లు తెలిపారు.రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాలన్నారు. వానకాలం మొక్కజొన్న సాగుకు బదులుగా రైతులు పత్తి,కంది సాగును చేయాలని సూచించారు. కంది, పత్తి పంటకు మంచి మద్దతు ధర వచ్చేలా చూస్తామని మంత్రి తెలిపారు.

మొక్కజొన్న కొనుగోలు తో ప్రభుత్వానికి నష్టం జరిగినా, రైతు సంక్షేమం దృష్ట్యా రైతుల నుండి కొనుగోలు చేస్తున్నామన్నారు. అవసరమున్న చోట జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వం గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో ఒక్కొక్కటిగా అన్ని సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. అందులో భాగంగా అన్ని గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్, ట్రాలీ అందించడంతోపాటు అన్ని గ్రామ పంచాయతీలలో డంప్ యార్డులు,వైకుంఠ దామాలు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు.

ప్రభుత్వం త్వరలో ఎస్సీ నిరుద్యోగ యువత కోసం రూ. 1000 కోట్లతో దళిత్ ఎంపవర్మెంట్ స్కీమ్ ను ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

ప్రభుత్వం కులం, మతం ,వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, అందోల్ శాసనసభ్యులు క్రాంతి కిరణ్, అదనపు కలెక్టర్ రాజర్షి షా, ఇతర ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ ఎస్ ఈ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే కరోనా కలకలం : రాహుల్ గాంధీకి స్మృతి ఇరానీ చురకలు

న్యూఢిల్లీ, జూన్ 22: కరోనా సెకండ్ వేవ్ వ్యాప్తిపై ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలను కేంద్ర మంత్రి, బీజేపీ నేత స్మృతి ఇరానీ తోసిపుచ్చారు. రాహుల్ గాంధీ జ్ఞాని బాబాలా విజ్ఞాన సుమాలను ఇతరులపై వెదజల్లుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే కరోనా సెకండ్ వేవ్ తొలుత వ్యాప్తి చెందిందని, తమ పార్టీ ప్రభుత్వాలు మహమ్మారిని ఎందుకు కట్టడి చేయలేదో రాహుల్ ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.ఓ కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో కరోనా మరణాల రేటు అత్యధికంగా ఉందని ఆమె వరుస ట్వీట్లలో పేర్కొన్నారు. మహమ్మారి వ్యాప్తిని నిలువరించడంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు అన్ని విభాగాల్లో విఫలమయ్యాయని ఆరోపించారు. కరోనా పాజిటివిటీ రేటు సైతం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే అధికంగా ఉందని ఆమె చురకలు వేశారు.కాగా ప్రధాని కన్నీళ్లతో ప్రజల ప్రాణాలు కాపాడలేమని, ఆక్సిజన్‌తోనే ప్రజల ప్రాణాలు కాపాడగలుగుతామని రాహుల్ వ్యాఖ్యానించారు. సెకండ్ వేవ్ వ్యాప్తిపై ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా గత కొంతకాలంగా రాహుల్ విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే

17 కోట్ల డోసులు ఇచ్చినా పోస్టర్లతో ప్రచారం చేసుకోలేదు : కాంగ్రెస్

న్యూఢిల్లీ, జూన్ 22: భారత్‌లో సోమవారం ఒకేరోజు అత్యధిక సంఖ్యలో కొవిడ్-19 వ్యాక్సినేషన్ సాగడం పట్ల కేంద్ర ప్రభుత్వం హడావిడి చేస్తోందని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. గతంలో పోలియో వ్యాక్సినేషన్ ప్రక్రియ సందర్భంగా ఇదే ఫీట్‌ను కాంగ్రెస్ హయాంలో సాధించినా అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ తన పోస్టర్లతో ప్రచారం చేసుకోలేదని వ్యాఖ్యానించింది. నిన్న ఒక్కరోజే 80 లక్షల వ్యాక్సిన్లను వేయడం పట్ల తాము సంతోషంగానే ఉన్నామని, అయితే గతంలో ఒక్కరోజులోనే పోలియో వ్యాక్సినేషన్ సందర్భంగా అత్యధికంగా 17 కోట్ల వ్యాక్సిన్లు వేశారని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రణదీప్ సుర్జీవాలా పేర్కొన్నారు.

మరోవైపు కాంగ్రెస్ వ్యాఖ్యలను బీజేపీ తప్పుపట్టింది. మహమ్మారిపై పోరులో ప్రభుత్వం కీలక అడుగులు వేసిన ప్రతిసారీ కాంగ్రెస్ పార్టీ వెనక్కిలాగేలా వ్యవహరిస్తోందని బీజేపీ ప్రతినిధి సంబిట్ పాత్రా ఆరోపించారు. కరోనా సెకండ్ వేవ్ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే ప్రారంభమైందని అన్నారు. కరోనా సెకండ్ వేవ్ లో అత్యధిక కేసులు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నమోదయ్యాయని బీజేపీ నేత పేర్కొన్నారు.

బసవేశ్వర ఎత్తిపోతల పథకం సర్వే పనులు ప్రారంభం .!

-రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు.

సంగారెడ్డి, జూన్ 21 (నేటినిజం ప్రతినిధి) ఒకప్పుడు తాగు నీరు లేని నారాయణఖేడ్ నియోజకవర్గానికి బసవేశ్వర లిఫ్ట్ తో సాగునీరు అందుతుందని మంత్రి అన్నారు.

సోమవారం నాడు మనూర్ మండలం బోరంచ గ్రామంలో బసవేశ్వర ఎత్తిపోతల పథకం సర్వే పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సభకు నారాయణఖేడ్ శాసన సభ్యులు మహ రెడ్డి భూపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఈ సర్వే కోసం రూ 11.15 కోట్లు మంజూరు చేసిందన్నారు. లక్షా అరవై ఐదు వేల ఎకరాలకు ఈ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందుతుందని మంత్రి తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన రెండు నెలల్లోగా సర్వే పూర్తి చేసి డి పి ఆర్ అందించాలని ఎస్ఈ కి ఆదేశించారు.

బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నారాయణఖేడ్ నియోజకవర్గం మొత్తానికి, అందోల్ నియోజకవర్గం లోని రేగోడు , పట్పల్లి మండలాలకు సాగునీరు అందుతుందన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గం లో 1.31 లక్షల ఎకరాలకు, అందోల్ నియోజకవర్గంలో 34 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు మంత్రి తెలిపారు. ఏ లిఫ్ట్ అవసరం లేకుండా మల్లన్న సాగర్ కాలువ ద్వారా 40 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.

బోరంచ, రామ్ తీర్త్ (కంగ్టి), దుద్యాలవద్ద లిఫ్ట్ లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో గత ప్రభుత్వాలు 70 సంవత్సరాలలో ఒక్క చుక్క నీరు తేలేదన్నారు. సాగునీరు కాదు కదా తాగునీరు ఇవ్వలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం సింగూర్లో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి నారాయణఖేడ్ నియోజకవర్గం లో ఇంటింటికి తాగునీరు అందిస్తుందన్నారు.

నల్లవాగు నిండుకుండలా ఉండేలా బాధ్యత తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. అన్ని చెరువులు, కుంటలను నీటితో నింపుతా మన్నారు.

నియోజకవర్గానికి మంచినీళ్లు, కరెంటు, రోడ్లు, స్కూళ్లు వచ్చాయని, కాలేశ్వరం గోదారమ్మ తల్లిని ఈ ప్రాంతాలకు తీసుకు వస్తున్నామని మంత్రి తెలిపారు.

నారాయణఖేడ్ నియోజకవర్గం లో రాబోయే రోజుల్లో అద్భుతమైన పాఠశాలలను నిర్మాణం చేస్తామన్నారు. నియోజకవర్గంలో కొత్త చెరువులను, చెక్ డ్యామ్ లను కడుతున్నామని తెలిపారు.

ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా రైతు చనిపోతే ఐదు లక్షల బీమా ఇస్తుంది తెలంగాణ ప్రభుత్వమేనని మంత్రి అన్నారు. ధరణి తో భూముల క్రయ విక్రయాలు సులువుగా మారిందన్నారు. పారదర్శకత పెరిగిందని, రైతులకు ఆర్థిక భారం తగ్గిందన్నారు.

అదేవిధంగా త్వరలో భూములకు సంబంధించి హద్దులను చూపేలా సర్వే చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

రైతులు వరి విత్తనాలు వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేయాలన్నారు. ఎకరాకు పది వేల పెట్టుబడి తగ్గుతుందని, దిగుబడి పెరుగుతుందని తెలిపాం ంపత్తి,కంది సాగు విస్తీర్ణం పెంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, జెడ్పి చైర్ పర్సన్ మంజు శ్రీ, శాసనసభ్యులు భూపాల్ రెడ్డి, క్రాంతి కిరణ్, శాసనమండలి ప్రోటేం చైర్మన్ భూపాల్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎంపీపీలు ,జెడ్పీటీసీలు ఎంపిటిసిలు, సర్పంచ్లు, అదనపు కలెక్టర్ రాజార్షి షా, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కళాబృందాల ప్రజలకు అవగాహన

రాజన్న సిరిసిల్ల, జూన్ 22(నేటినిజం ప్రతినిధి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు,టౌన్ సీఐ వెంకటేష్ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్లో గంగమ్మ మార్కెట్ ఏరియాలో మంగళవారం జిల్లా పోలీస్ కళాబృందాలచే కరొనా కట్టడి ప్రజలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాస్క్ పెట్టుకుని చేతులను సానిటైజర్లు లేదా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలని అన్నారు.అలాగే భౌతిక దూరం పాటించాలని ఆయనే ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో పోలీస్ కళాబృందం ఇన్ఛార్జ్ సతీష్ చరణ్ ,సభ్యులు పాల్గొన్నారు

సీబీఎస్ఈ మార్కుల విధానాన్ని సమర్థించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూన్ 22:పన్నెండో తరగతి విద్యార్థులకు మార్కులను కేటాయించేందుకు సీబీఎస్ఈ, సీఐఎస్ఈ ప్రతిపాదించిన విధానాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. విద్యార్థులు భౌతికంగా హాజరై పరీక్షలు రాసే అవకాశం కల్పించాలంటూ పేరెంట్స్ యూనియన్‌లు దాఖలు చేసిన పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది.

సీబీఎస్ఈ, సీఐఎస్ఈ ప్రతిపాదించిన విధానం సమంజసంగా, న్యాయంగా ఉన్నదని తెలిపింది. ఈ విధానంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టంచేసింది. విద్యా రంగంలోని నిపుణులు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రతిపాదనలు చేశారని తెలిపింది. ఎవరికీ ప్రతికూలత లేకుండా పరిపూర్ణ స్థాయిలో ఈ ప్రతిపాదనలు ఉన్నట్లు పేర్కొన్నది. దీనిపై రెండో ఆలోచనకు తావులేదని స్పష్టం చేసింది.

ఘర్ ఘర్ రేషణ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్



హైదరాబాద్ , జూన్ 22:ప్రముఖ బ్యాంక్ ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

కోవిడ్ కారణంగా జీవనోపాధులపై ప్రభావం చూపించిన తమ అల్పాదాయ వర్గాలకు కస్టమర్ల కోసం ఎపంపాయి ఫండెడ్ కార్యక్రమం ఘర్ ఘర్ రేషణ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ ఆరంభిస్తున్నట్లుగా ఐడిఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రకటించింది. కోవిడ్-19 కారణంగా దురదృష్టవశాత్తు తన జీవితాల్ని కోల్పోయిన ఉద్యోగుల కుటుంబాల కోసం కూడా ఒక సమగ్రమైన కార్యక్రమాన్ని వైరస్ వ్యాప్తిని నియంత్రించే లక్ష్యంగా ఇతర సామాజిక ప్రతిస్పందన చోవవల్ని కూడా బ్యాంక్ ప్రకటించింది. ఈ సందర్భంగా ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ ఎండీ అండ్ సీఇఓ వి.వైద్యనాథన్ మాట్లాడుతూ సంక్షభం తీవ్రతను పరగణించి అన్ని సమస్యల్ని తాము పరిష్కరించేమన్నారు. తాము సాధ్యమైనంత వరకు తమ కస్టమర్లకు సహాయం చేయాలని కోరుకుంటున్నామన్నారు. కాబట్టి తమ ఘర్ ఘర్ రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు.

బిట్స్ పిలాని దుబాయ్ క్యాంపస్‌లో గణనీయంగా పెరిగిన భారతీయుల విద్యార్థులు

హైదరాబాద్ , జూన్ 22:దుబాయ్‌లో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని బిట్స్ పిలాని దుబాయ్ క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ ఎన్ సాహో తెలిపారు. ఐదేళ్ల కాలంలో ఈ సంఖ్య ఐదారు శాతం నుంచి 15 శాతానికి అనగా మూడు రెట్లు పెరిగిందన్నారు. ఇంజనీరింగ్, బిజినెస్ కోర్సులతో పాటు విద్యార్థులను ఆకర్షించే ప్రసిద్ధ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయన్నారు. విదేశాలలో సరసమైన విద్యను కోరుకునే భారతీయ తల్లిదండ్రులు దుబాయ్ ను కచ్చితంగా ఎంచుకుంటారని తెలిపారు. దుబాయ్‌లో 200 పైగా జాతీయులు నివసిస్తున్నారన్నారు. ఈ నగరం అధిక నాణ్యత గల విద్యను అందిస్తోందన్నారు. అంతర్జాతీయ నగరం అయినప్పటికీ సరసమైన ట్యూషన్ ఫీజు, తక్కువ జీవన వ్యయం ఇక్కడ ప్రత్యేకతన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్, కెనడా, యూరోపియన్ దేశాలు, ఆస్ట్రేలియా తదితర ప్రసిద్ధ అధ్యయన గమ్యస్థానాలతో పోలిస్తే యూఏఈ విశ్వవిద్యాలయ రుసుం మూడింట ఒక వంతు అన్నారు.యూఎస్ ఇతర పాశ్చాత్య విశ్వవిద్యాలయాలలో రూ.22 లక్షలు నుంచి 40 లక్షలు (వి 30,000- వి 55,000) రుసుముకి భిన్నంగా, యూఏఈ విశ్వవిద్యాలయాలలో ఫీజులు చాలా తక్కువన్నారు. రూ. 8 లక్షలు -18 లక్షలు (వి 12- వి 25,000) మాత్రమేనని తెలిపారు. ప్రతిభావంతులైన భారతీయ అభ్యర్థులకు ఆకర్షణీయమైన స్కాలర్‌షిప్‌లు ఉన్నాయన్నారు. దుబాయ్ క్యాంపస్‌లో ప్రవేశం కోసం భారతదేశంలోని విద్యార్థుల నుంచి ఈ సంవత్సరం 15 శాతానికి పైగా దరఖాస్తులు వస్తున్నాయన్నారు. తల్లిదండ్రులు ఇప్పుడు విదేశాలలో సురక్షితమైన ఇంటికి దగ్గరగా అధ్యయనం చేయడాన్ని ఎక్కువగా చూసేందుకు మహమ్మారి కూడా పాత్ర పోషించిందన్నారు. యూఏఈ తన టీకా రోల్ - అవుట్ కార్యక్రమంలో ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తోందని వివరించారు. 85 శాతం అర్హతగల జనాభాకు ఇప్పటికే టీకాలు వేశారన్నారు. నివాసితులకు, పర్యాటకులకు సురక్షితమైన వాతావరణం ఏర్పడిందన్నారు. ఇన్స్టిట్యూట్లో సిబ్బంది, విద్యార్థులు, వారి కుటుంబాలకు 100 శాతం టీకాలు వేసేలా చూశామన్నారు. తల్లిదండ్రుల ఆర్థిక భారాన్ని తగ్గించడానికి అర్హులైన విద్యార్థులకు రూ.10 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లు ప్రకటించామన్నారు. స్కాలర్‌షిప్‌లు గరిష్ట సంఖ్యలో విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ట్యూషన్ ఫీజుతో పాటు హాస్టల్ ఫీజుపై రాయితీ కూడా వర్తిస్తోందన్నారు. ఎన్‌బీఐ, ఐసీఐసీఐ,హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిలాతో విద్య రుణాలను సులభతరం చేయడానికి ఏర్పాట్లు ఉన్నాయన్నారు. దుబాయ్‌లోని విశ్వవిద్యాలయాలు ఆధునిక మౌలిక సదుపాయాలను కలిగి ఉన్నాయన్నారు. దుబాయ్ నేరాల రహితమైనదన్నారు. గ్లోబల్ క్రైమ్ ఇండెక్స్ 2020 ప్రకారం యూఏఈ సురక్షితమైన దేశాలలో మూడో స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు. వాస్తవానికి మూడు నగరాలను కలిగి ఉన్న ఏకైక దేశం అనే అరుదైన ఘనతను సంపాదించిందన్నారు. దుబాయ్, అబుదాబి, షార్జా ప్రపంచంలోని మొదటి పది సురక్షితమైన నగరాల్లో ఒకటన్నారు. రకరకాల వంటకాలు లభిస్తున్నాయన్నారు. పెద్ద సంఖ్యలో భారతీయ ప్రవాసులు ఉండటం, భారతదేశంలోని దాదాపు అన్ని నగరాలకు విమానాలు (3-4 గంటల దూరంలో) ఉందన్నారు. ప్రవేశ సౌలభ్యం సులభంగా ఉండటంతో ఎక్కవ మంది ఆకర్షితులవుతున్నారని తెలిపారు. వాస్తవానికి, క్యాంపస్ ఉద్యోగ నియామకాలను పొందే విద్యార్థులలో 98 శాతం మంది యూఏఈలోనే పని చేస్తారన్నారు. 7.5 నెలల ప్రాక్టీస్ స్కూల్ (ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్) కార్యక్రమం పాఠ్యాంశాల పంపిణీకి సమగ్రంగా ఉన్న విలక్షణమైన

విస్తృత-ఆధారిత విద్యావ్యవస్థను అందించడం ద్వారా గౌరవనీయ సంస్థ తనను తాను వేరు చేస్తుందన్నారు. ఇంటర్న్‌షిప్ సమయంలో పొందిన పరిశ్రమ అనుభవాలు కార్పొరేట్ ప్రపంచంలోకి సులువుగా మారడానికి హామీ ఇస్తాయని పేర్కొన్నారు. సెప్టెంబర్ 2021 తీసుకోవడం కోసం టాప్ కోర్సులు బి.ఇ బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ మరియు మెకానికల్ ఇంజనీరింగ్. కోర్సులు, అద్భుతమైన స్కాలర్‌షిప్ ఎంపికలు మరియు తాత్కాలిక ప్రవేశాల గురించి మరింత సమాచారం కోసం

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com